మల్లంపల్లి శరభయ్య

శ్రీ వేణుగోపాలకా!

C1

YRKA111B 174

'నా కవిత్వం యోగం. సాహిత్యాన్ని యోగంగా ఉపాసించాను.'

మల్లంపల్లి శరభయ్య
1928 - 2007

శ్రీ వేణుగోపాలకా!

శ్రీ వేణుగోపాల శతకము, ఖండ కావ్యాలు

ఎమెస్కో

శ్రీ వేణుగోపాలకా!
(శ్రీవేణుగోపాల శతకము, ఖండకావ్యాలు)
(1941-2003)
మల్లంపల్లి శరభయ్య (1928-2007)

ప్రథమ ముద్రణ : సర్వజిత్ జ్యేష్ఠము, 2007
© మల్లంపల్లి మల్లికార్జున శాస్త్రి, రాజమండ్రి

వెల : **30/-**

కూర్పు
పల్లవి గ్రాఫిక్స్
హైదరాబాద్

ముద్రణ
సాయి శ్రీనివాసా ప్రింటర్స్
హైదరాబాద్

ప్రచురణకర్తలు
ఎమెస్కో బుక్స్
డో.నెం. 29-13-53,
కాళేశ్వరరావు రోడ్డు, సూర్యారావుపేట,
విజయవాడ - 0866-2436643, 2577498, 98499 92890,
email: emescobooks@yahoo.com

శివార్చనమ్

2003 జనవరి 5 సాయంత్రం 6 గంటల సమయం...

విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణం...

ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో ఓ హిమోత్తుంగ శృంగం...

ఆరోగ్యం సహకరించకపోయినా సాహిత్యాభిమానంతో కదలి వచ్చిన మధుర క్షణం...

ఆ రోజు సాయంకాలం ఎమెస్కో ఏర్పాటుచేసిన చినవీరభద్రుడి పునర్యానం కావ్య ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ మల్లంపల్లి శరభయ్యగారిని మొదటిసారిగా దర్శించుకునే భాగ్యం కలిగింది. వారిని అక్కేశ్వర్రావు స్మారక ఎమెస్కో సాహిత్య పురస్కారంతో సత్కరించుకునే అవకాశం కలిగింది. అప్పటికే శ్రీవారి గురించి నేను కొంత తెలుసుకుని ఉన్నాను. అయితే వారిని దర్శించుకోవటం మాత్రం అదే మొదటిసారి. వారు వేదికపైకొచ్చిన క్షణం నుంచి అక్కడ ఓ ఉద్వేగభరితమైన వాతావరణం ఏర్పడింది. వారిలో కృష్ణశాస్త్రి, విశ్వనాథల అపూర్వ సమ్మేళనం మూర్తీభవించినట్టుంది. తన బిడ్డను ఆత్మీయంగా అక్కున చేర్చుకోవటానికి తన సర్వశక్తులను కూడగట్టుకుని కదలివచ్చిన తండ్రి వారిలో నాకు కనిపించారు. వారు మాట్లాడిన ప్రతి మాటను విజయవాడ విద్వత్‌జనులు మనసులో పదిలపరచుకున్నారు.

శివదర్శనం చేసుకున్న ఆ మహనీయుడు 12-4-2007న శివసాన్నిధ్యం పొందారని తెలిసినప్పుడు నాలాంటి వారెందరో తమ తండ్రిని పోగొట్టుకున్న అనుభూతిని పొందారు.

వారి కవిత్వం పుస్తకరూపంలో తెచ్చే అదృష్టం ఆ రోజు వారి దర్శన పుణ్యాన నాకు కలిగిందనుకుంటాను. అంతటి మహాకవి కవితలన్నీ సంపూర్ణంగా ఇప్పటికీ ఓ సంకలనంగా విడుదల కాకపోవడం ఆశ్చర్యకరమే అయినప్పటికి అది నాకు భాగ్యంగా పరిణమించింది. అజరామరమైన ఆయన సాహిత్యం మనతో ఆయన ఎప్పుడూ ఉండేలా చేస్తుంది. అందుకే ఈ చిన్న సంపుటం. ఇది శివార్చనకు నాకు కలిగిన అవకాశంగా భావిస్తున్నాను.

ఈ పద్యాలను ప్రచురించడానికి అనుమతించిన శ్రీమల్లంపల్లి మల్లికార్జునశాస్త్రి గారికి మరియు ఈ కవితలను ఇప్పటికే ప్రచురించిన వివిధ పత్రికలకు, ప్రత్యేకించి, శ్రీవేణుగోపాల శతకమును ముద్రించిన జగద్గురు పీఠం వారికి, సురుచి ప్రచురణలకు మరియు శరభయ్యగారి పద్యాలను ప్రచురించిన చైతన్య కవిత పత్రికా సంపాదకులు తంగిరాల సుబ్బారావు గారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. త్వరలో శరభయ్యగారి సాహిత్య ప్రసంగాలను కూడా మీ ముందుకు తీసుకురావాలని సంకల్పిస్తూ..

మీ

ఎమెస్కో విజయకుమార్

విషయ సూచిక

సరస్వతీ అవతారుని హృదయగ్రాహి పద్యాలు :
గుంటూరు శేషేంద్రశర్మ 5
ఖండ కావ్యాలు (1941-2003) 11
శ్రీ వేణుగోపాల శతకము (1981) 53

సరస్వతీ అవతారుని హృదయగ్రాహి పద్యాలు

శ్రీ శరభయ్య సరస్వతి అవతారము. పూర్వ గీర్వాణాంధ్ర కవులందరూ ఆయన రసనాగ్రమెక్కి తమ ఘనతను చాటుకుంటారు; తమ కీర్తిపతాకను ఎగుర వేస్తారు. ఆయన వాక్కు మేరువులా ఆ దేవతల నివాస స్థానము. కనకనే గంగా ప్రవాహం లాంటి ఆయన పద్యసందోహంలో ఆ కవుల పావనా కృతులు పుష్ప నౌకల్లా తేలుతూ పోతుంటాయి. "శ్రీ వాణీ కర ధూత చామర శిఖా శీతాని లానీత సం। సేవా సంవలి తాలకమ్ము, హసిత శ్రీ లాసి కాలాస్య వీఃథీ విద్యోత నవారుణాధరము..." అని ఆయన అంటూ ఉంటే "ఉదయ గ్రావము పానవట్టము" అనీ, "భస్మోద్ధూళన పాండురాంగము" అనీ, లేక "ధూతాతంక మపేత పంకము" అనీ, లేక "శీతాహార్య సుతాళినీ వికచ రాజీవంబు విశ్వేశ్వర జ్యోతిర్లింగ విశుద్ధ రత్నఖని" లాంటి జాజ్వల్యమానములైన ఉల్కలు ఎక్కడినుంచో సారస్వత రోదసిలోనుంచి మన మనోమండలం మీదికి రాలుతుంటాయి. "రింఖ త్తరంగాగ్ర కంకణ యై కృష్ణ" అనగానే "పంపాతరంగ రింఖణ ఝంపా సంపాత్యమాన జలకణ రేఖా" అని ఒక ఉల్క రాలుతుంది.

"ఎవ్వాడు డాచేతి క్రొవ్వడి నఖమున
　　చిదిమె భాషాదేవి చిగురుముక్కు,
కనకమేఖల గ్రుచ్చి కట్టె నెవ్వడు లీల
　　జెఱుగుపై పూషార్కు మెఱుగు పండ్లు,
కొసరకెవ్వడు పదాంగుష్ఠ భాగంబున
　　ఉడురాజు పొట్ట గుంజురుక నూదె,
తరిగె నెవ్వడు ఖడ్గ ధారాంచలంబున
　　నగ్ని నాలుక లేదు నంటదరిగె,
మోదె నెవ్వాడు ముప్పది మూడు కోట్ల
వేలుపుల బారబార వెన్వెంట దరిమి,
యట్టి శ్రీ వీరభద్రు డీయద్రి మీద
భద్రకాళియు దా నుండు బద్మనయన"

–అనే సముద్దండ వేదండంలాంటి శ్రీనాథ సీస పద్యాన్ని శ్రీ శరభయ్య ఎలా తన పిడికిటి మీద పడుకోబెట్టాడో చూడండి:

"స్వాహానాయకు నాల్కలంటదెగి, పూషాదిత్యు పండ్లూడి, త
న్నీహార ద్యుతి కంది డింది, తెగివాణీ నాస, నెమ్మె, తురా
సాహుం దోహటిలన్ నటింప గణముల్ సాహెూనినాదార్భటిన్
త్రాహి త్రాహి ఘటింపవే విధికి? భద్రా! భద్ర కాళీశ్వరా!"

(భద్ర కాళీశ్వరా!)

ఆయన, పద్యం చేత నైకభంగిమల్లో నాట్యం చేయిస్తాడు. ఆయన సీసపద్యాలు రాజమార్గంలో అడుగుపెట్టిన ఐరావతాల మందలు; ఆయన శార్దూల మత్తేభాలు ప్రమథ గణాల చిందులు. ఆయన పద్యంలో ఒక్కో పాదం ఒక్కో చెరుకుగెడ; ఆ గెడలో కణుపులే గణాలు! "పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే నమస్తే జగదేక మాతః"

శరభయ్య సూక్తుల సారభాల్లో ఆయన వాల్మీకిది స్త్రీ ప్రకృతి అన్నాడు. ఎంత కావ్యతత్త్వగర్భ నిర్భరమైన మాట! కావ్యం కాంతా సమ్మితము గదా. లొల్ల లక్ష్మీధరుడు తన సౌందర్యలహరి వాఖ్యారంభంలో అంటాడు, "వందే మహి మహీయాంసం। అంస లంబి జటాధరం। యత్కంకణ ఝుణత్కారవశ్శబ్దాను శాసనమ్"॥ ఆ జగన్మాతయే మధు స్వరూప అయిన కవిత్వదాయిని. (మధు మేధయా బ్రహ్మ మేధయా....)

తెలుగు పద్యం ఒక కులీన సంస్కృతి; మానవీయ సంస్కారంలో సమగ్రత రావాలంటే అనేక సాంస్కృతిక ద్రవ్యాలు సేవించాలి; వాటిలో పద్యం అనే సుగంధద్రవ్య మొకటి. అయితే పద్యరసాస్వాదన కోసం ఒక ప్రత్యేక శిక్ష అవసరం. అక్కరలేదనుకునే వాడికి అలా అనుకోవడానికి స్వేచ్ఛ ఉంది. ఇతరుల విషయం - ఒక మధురానుభవం సిద్ధింప జేసుకోడానికి ఒక ఆరాధన అవసరం. దానికి కావలసిన పుష్పాలు విష్ణుచిత్తుడు కోసి తెచ్చినట్లు తెచ్చుకోవాలి; ఫలాలు శబరిలా రుచిసూక్ష్మం తెలుసుకుని కొమ్మల నుంచి కోమలంగా తెంచుకుని రావాలి. నేలమీద కూర్చుని సానమీద శ్రీగంధపు చెక్క చాది చాది తీసి గంధం తెచ్చుకోవాలి. అవి పూజా ద్రవ్యాలు. అలాంటి ద్రవ్యాలతో ఆరాధన చేస్తేనే ఆస్వాదన సిద్ధిస్తుంది.

ఆ విధంగా శబ్దార్థాల స్వభావంలోఉన్న నాజూకుదనం తెలిసి ఏ సందర్భానికి ఏవి కావాలో తదనుసారంగా ఎన్నుకోవాలి. చెరుకు గెడలు, ఆకులతో సహితం ఉన్న అరటి బ్రాకులు అలంకరించిన పందిరిలో వాగర్థ సంపృక్తతారూప దేవతను ప్రతిష్ఠించాలి. అంగన్యాస కరన్యాసాదులతో ఆ దేవతను తనపై ఆవాహన చేసుకోవాలి. నువ్వే నేను నేనే నువ్వు అనే తాదాత్మ్య భావనతో జపించాలి తపించాలి. అప్పుడు ఉపాస్య ఉపాసక భేదం తొలగిపోయి దేవతారాధనా ఫలసిద్ధి కలుగుతుంది.

ఇక్కడ చెరుకుగెడలపందిరి ఛందస్సు, శబ్దార్థాలు గంధమాల్యాదులు. ప్రతిష్ఠిత దేవత కవిత్వము. ఇంత చేస్తేనే తెలుగు పద్యసారస్వతంలో ఉన్న "తత్పరసాకార ముదార మన్మథ

కళా సర్వస్వ శృంగారమున్" అన్నట్టు శృంగార సర్వస్వ స్వరూప, కేవల రమణీయతా మూర్తి అయిన కవిత్వరసాస్వాదనాసిద్ధి కలుగుతుంది. అలా కాక "విరసాంతః కరుణుండవై" కాఫీ సిగరెట్లు సేవిస్తూ, కాశీ ఖండం మీద కాలు మోపి నిల్చుని, 'సామాజిక చైతన్యము' 'సమకాలీన సాహిత్యము' అంటూ తనకే అవిదితములైన కర్కశ తర్క శస్త్రాలు ఝళిపిస్తే ఆ రమణీయతా దేవత ఎలా అభిముఖమవుతుంది? ఎలా సుప్రసన్నమవుతుంది? ఇక ఎలా వరదాయిని అవుతుంది?

ధన్యుడు శ్రీ శరభయ్య, పద్యం ఇంకా రాస్తూ ఉండే భాగ్యం ఆయనకు కలిగింది. బ్రతికే ఉన్న తెలుగు పద్యాన్ని చచ్చిందంటున్నారు. చచ్చేదే అయితే ఇరవయ్యో శతాబ్దంలోనే ఎందుకు చావాలి? 11వ శతాబ్దంలో బయల్దేరిన పద్యం నేటివరకు నడిచిన 10 వందల సంవత్సరాల కాలం చావడానికి చాలినంత కాలం! వర్తమాన దృశ్యం చూస్తే పద్యం చచ్చిందనిపించక పోవడమేగాక చస్తుందని కూడా అనిపించదు. ఈ విషయాన్ని అజ్ఞాన తిమిరంలో ఉన్న తెలుగు కూపస్థులకు పరిమితం చెయ్యకుండా, ప్రపంచ కవిత్వ చిత్రం చూస్తే విదితమయ్యే విషయం గ్రహించాలి. వచన కవిత్వం రాయొద్దనడం లేదు. అది కూడా నిరాఘాటంగా రాయబడాలి. దానిలోనూ ఎన్నో మహిమలున్నాయి. కానీ పద్యం చచ్చిందనడం మాత్రం అవిచార మూలకం.

రాబర్ట్ షార్ట్ అనే విమర్శకుడు 'Modernism' అనే పుస్తకంలో "డాడాయిజయ్ అండ్ సర్రియలిజం" అనే వ్యాసం రాస్తూ అందులో "Modern poetry has placed a great weight on conscious craftsmanship; Baudelaire derived this from poem and transmitted it to Mallarme and Valery"-

"Modernism" అనే పుస్తకంలో క్లయిన్ స్కాట్ తన "దిప్రోజ్ పొయం ఎండ్ ఫ్రీవర్స్" అనే వ్యాసంలో "Pound and Eliot did not tire of telling us that writing prose (ప్రోజ్ అంటే ప్రోజ్ పొయం) is as demanding as writing verse, if not more" అన్నాడు.

ఈ మధ్య మన కొచ్చిన ఫ్రీవర్సుకు 19వ శతాబ్దంలో ఫ్రెంచి సింబలిస్టులు జన్మ నిచ్చారు; ఆ కాలంలోనే స్వతంత్రంగా అమెరికాలో వాల్ట్‌విట్మన్ తన "లీవ్స్ ఆఫ్ గ్రాస్" అనే కావ్యాన్ని ఫ్రీవర్సులోనే రాశాడు! కానీ ఈ 19వ శతాబ్దపు ఫ్రీవర్సు, ఇంగ్లండులో షేక్స్పియర్‌కు పూర్వమే హెన్రీ హొవార్డ్ అనే కవి రోమన్ మహాకవి వర్జిల్ రచిత ఇలియడ్‌ను ఆంగ్లంలోకి అనువాదం చెయ్యడానికి సృష్టించాడు. దాని పేరు 'బ్లాంక్ వర్సు'. ఈ బ్లాంక్ వర్స్‌లోనే షేక్స్పియర్ తన నాటకాలు రాశాడు! మిల్టన్ తన ప్యారడైజ్ లాస్ట్ రాశాడు. వర్డ్స్‌వర్తు రాసిన "ది ప్రిలూడ్" టెన్నిసన్ రాసిన "ఇడిల్స్ ఆఫ్ ది కింగ్" బ్లాంక్ వర్సులోనే ఉన్నాయి. ఫ్రెంచి కవి పాల్‌క్లాడెల్ ఫ్రెంచి ఫ్రీవర్సే ఇంగ్లీషు బ్లాంక్ వర్స్ అని చెప్పాడు. బ్లాంక్ వర్స్‌కు పూర్వం మన మార్గచ్ఛందస్సుల్లాంటివి పాశ్చాత్య దేశాల్లో ఉండేవి - అలెగ్జాండ్రీన్, ట్రొకేయిక్ - టెట్రామీటర్,

అనా పేస్టిక్ టెట్రా మీటర్ ఇత్యాదులు. గణాల్ని వాళ్ళు 'ఫీట్' అంటారు. అయాంబ్, ట్రోకీ, అనాపెస్ట్, డ్యాక్టైల్ ఇత్యాలు వాటి పేర్లు. కనక గణచ్ఛందస్సులు ఆ దేశాల్లో 16వ శతాబ్దానికి పూర్వమే పోయాయి. మళ్ళీ 18వ శతాబ్దంలో వాటిని అవలంబించిన అలెగ్జాండర్ పోప్ లాంటి కవుల్ని విమర్శకులు నియోక్లాసిస్ట్స్ అన్నారు.

కనుక ఇక్కడ ఈ మధ్య మనం ఆధునికత పేరుతో కవిత్వంలో చేస్తున్న కుస్తీలు అక్కడ చేసి పారవేయబడినవి. బోదిలేర్ రాసిన "పెటిట్స్ పొయమ్స్ ఇన్ ప్రోజ్" అనే వచనరూపంలో ఉన్న కవితల మూలంగా పాశ్చాత్యకవిత ఫ్రీవర్సును కూడా విడిచి వచన రూపం ధరించింది. ఫ్రీవర్సు ఛందోబద్ధ పాదాల్లా కనిపించే లైన్సుగా విరిచి రాయబడితే, వచన కవితా అలా లైన్సుగా విరవబడకుండా లైన్ల సముదాయాల రూపంలో ఉంటుంది. కానీ కవిత కరుణాత్మకత లేక సంవేదన శీలత ఉన్న ఒక విలక్షణ అనుభూతి లోనుంచే పుదుతుంది గనక, దాని రచన సాధారణ శబ్దాల్లో వాక్యాల్లో ఉండక, అప్రయత్నంగానే ఒక విలక్షణ శబ్ద విన్యాసమునన్న పంక్తిగానే అభివ్యక్తమవుతుంది. అట్టి రచనలో ఆ విశిష్ట సన్నివేశ బలంచేత ఆ పంక్తుల గమనంలో ఒక కళాత్మక శబ్దరచనాకేళి ఉంటుంది. దీన్ని అక్కడ విమర్శకులు 'కేడెన్స్' అన్నారు. ప్రాచీనచ్ఛందస్సుల్లో గణబద్ధలయ ఉండగా, ఫ్రీవర్సులో స్వచ్ఛందలయ ఉంది. ఈ విధంగా పాశ్చాత్య కవిత ప్రాచీనచ్ఛందాన్ని త్యజించి ఫ్రీవర్సును అవలంబించి, దాన్ని కూడా విడిచి కేవల వచన రూపాన్ని ఆలింగన చేసుకున్నప్పటికీ, కవితను ఏ దశలోనూ విడవలేదన్న మాట.

కనకనే క్లయిన్ స్కాట్ అనే విమర్శకుడు తన "ది ప్రోజ్ పొయెం అండ్ ఫ్రీవర్స్" అనే వ్యాసంలో ("Modernism" an anthology of Essasys edited by Malcolm Bradbury and James Mac Farlance, 1987 Edition) "Measure defines the quantity and quality of beats; cadence is properly the spirit, the soul that must be added" అన్నాడు.

సర్రియలిస్టులైన ఆంద్రే బైతో, పాల్ ఎలార్డ్, ఆక్టేవియో పాజ్, జాక్ ప్రిపేర్, మరియు డైలాన్ థామస్ ఇత్యాది ప్రసిద్ధ కవులు ఫ్రీవర్సు లోనూ వచన రూపంలోనూ కవితలు రాసిన వాళ్ళే. కానీ వీరందరిలోనూ కేడెన్స్ అనే విలక్షణ శబ్ద విన్యాస కేళి అనివార్యంగా ఉంది. జాక్ ప్రిపేర్ రాసిన వచన కవితల్ని సంగీతబద్ధం చేసి పాడుతారు. మన సంస్కృత చంపువుల్లోనూ గద్యకావ్యాల్లోనూ తెలుగు ప్రబంధ గద్యల్లోనూ మనకు కేడెన్సు స్పష్టంగా కనిపిస్తుంది.

కవితకు అలంకారం గుండె అయితే కేడెన్స్ దాని స్పందన. అలంకారిక భాష కేడెన్స్ సహితంగానే పుదుతుంది. ఈ కేడేన్సే ఛందస్సుకు ఆత్మ అనేది స్పష్టం. కనక పద్యం చచ్చిందన్నా సరే, పద్యం తన ఆత్మను ఏదో రూపంలో నిలుపుకుంటోంది గనక, అది అజరామరమనే

చెప్పాలి. పద్యం "ప్రజలకు" అర్థంకావడం లేదు గనక చచ్చిందనే చెప్పాలి అన్నట్లయితే పద్యేతరరూప కవితలు కూడా ఆ "ప్రజల"కు అర్థం కావడంలేదనేది లోకానుభవసిద్ధం.

ఇక్కడే కాదు, లోకమంతటా ఇలాగే ఉంది కవిత్వ స్థితి. అందుచేతనే గ్రేహం హగ్ అనే ఒక గొప్ప విమర్శకుడు తన "మాడర్నిస్ట్ లిరిక్" అనే వ్యాసంలో ("Modernism") "It was Shelly who said that poets are the unacknowledged legislators of the world; however, it would not have been necessary to say this if it had been obviously true. Such exalted claims are likely to be made just when they are becoming difficult to sustain and it is in the generation after the Romantics that the retreat of poetry from its public role first, becomes evident'.

ఫలితార్థంగా ఇంత "హృదయగ్రాహి" పద్యాలను ఇంత భయంకర కాలంలో కూడా మనకు ఇచ్చిన శ్రీ శరభయ్యను ఎంతగా హృదయానికి హత్తుకోవాలో మాటల్లో చెప్పలేను.

గుంటూరు శేషేంద్రశర్మ

జ్ఞాన్ బాగ్ ప్యాలెస్
హైదరాబాదు
11-12-1993

పూల నెచ్చెలి

రసజిఘ్రక్షా ఋషియై,
విస్మృమర త్రైలింగ కల్పవృక్షచ్ఛాయా
వసదమృతాంధః ప్రభువై
యెసగును శరభాఖ్యశర్మ ఇద్ధయశుండై!

సఖుడాతండు మదీయ హార్దిక మహా సామ్రాజ్య సింహాసనం
బఖిలంబున్ గొని యాక్రమించి, నను నేయానంద వైహాయసీ
శిఖరాగ్రంబులకో తరల్చె నతడే చిక్రోడమై శాఖలన్
ముఖరించెన్ భవదామ్ర కమ్ర కవితా మూర్ధన్య దేశమ్ములన్.

నాకుం దమ్ముడు, పూలనెచ్చెలి, వసంతస్నాత చూతావనీ
శాఖాకోకిల, శ్రావణాభ్ర విలసచ్చాంపేయ రోచిస్సు, శ్రీ
రాకా చాంద్రమసీ నిశీథి యనుచున్, రమ్యాక్షర ప్రౌఢితో
వాకొందున్ శరభయ్య నార్ద్ర కవితా స్వాదిష్ఠ కూలంకషన్!

కవియొక చందమామ, తన కావ్యము వెన్నెల పూసుకున్న వ
స్తువుల జగత్తు, వాఙ్మయ మధువ్రతుడైన కృతీశమౌళియో
నవరస పశ్యతోహరుడు, నమ్రుడ నేనిక నేమిచెప్పుదున్
ధవళిమ వెల్లిగొన్న కలధౌత మయంబు సమస్త మిచ్చటన్.

గుంటూరు శేషేంద్రశర్మ

ఖండ కావ్యాలు

(1941-2003)

'ఒకసారి శ్రీ కృష్ణాచార్యులవారు బందరు వచ్చారు. సాంగవేద పాఠశాల వార్షికోత్సవంలో ఉపన్యసించడానికి. ఆయన నాకు 'పుంభావ సరస్వతి' అని బిరుదు ఇచ్చారు. ఒక లక్ష ప్రశంసలకన్నా అది నాకు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ప్రీతిదాయకమనిపిస్తుంటుంది. పదమూడేళ్లకే నేను పద్యాలు రాసేవాణ్ణి. వాటిని చాలా మెచ్చుకునేవారు పెద్దలు. మురిపెంగా నన్నుద్దేశించి 'అదుగో, కాళిదాసు వెళుతున్నాడు' అనేవాళ్ళు.'

'నా కవిత్వం యోగం. సాహిత్యాన్ని యోగంగా ఉపాసించాను. చిన్నప్పుడు నేను వ్రాసిన పద్యాలు ఏవైనా మా నాయనగారికి వినిపిస్తే – 'ఇప్పటి వాళ్ల కవిత్వంలాగా లేదు. ప్రాచీన కవులు వ్రాసినట్లుంది' అనేవారు. అది ప్రశంసో, అప్రశంసో నాకు తెలిసేది కాదు.'

'ఇటీవల బసవేశ్వరుడి వచనాలు ఐదువందలు సంస్కృతీకరించాను. ఇంతకు పూర్వమే వేణుగోపాల శతకము వ్రాసాను. ఎక్కువ వ్రాయలేదు. ఎందుకంటే కవి కావడం కంటే సహృదయుడవడం కష్టం. చెరకుతోటలో గొర్రెలు ప్రవేశిస్తే ఆ చెరకు గెడల ఆకులు మాత్రమే మేస్తాయవి. ఏనుగు ప్రవేశిస్తే కదా! చెరుకు రసం రుచి ఎట్లా ఉంటుందో తెలియడానికి అన్నాడు బసవేశ్వరుడు'.

(అక్కిరాజు రమాపతిరావుగారు చేసిన ఇంటర్వ్యూలో మల్లంపల్లి శరభయ్య, 2003)

త్రయీ జనని

ఓంకా రాగ్రమలతా సుమంబవయి నీవున్నావు మందస్మితా
లంకారమ్ము వెలుంగ మాధుకర మాలా నీల నీలమ్ములై
వంకల్ దేరి లలాట వీథి నటియింపన్ ముంగురుల్ వల్లకీ
టంకారమ్మొనరించునిన్ను మది నుట్టంకింతు త్రయ్యంబికా॥

శ్రీ వాణీ కరధూత చామరశిఖా శీతానిలా నీత సం
సేవా సంవలితాలకమ్ము హసిత శ్రీ లాసికా లాస్య వీ
థీ విద్యోతి నవారుణాధరము చింతింతున్ సహస్రార ప
ద్మావాసమ్మయి వెల్గు నీయమృత దేహజ్యోతి త్రయ్యంబికా॥

అమల చకోర బాంధవ కలాశ్రిత మూర్ధము, లాత్తమందహా
స మసృణ విద్రుమాధర విచాలన భృంగములన్ విచిత్ర ప
ర్ణములు వినీలకాంత నయనాంచలసారి కృపామరంద ము
గ్ధములు గదమ్మ! నీ మొగముదమ్ములు వేదవనీ వనప్రియా॥

నానా భూషణ బింబరాజ దధరాలంకార మందస్మితాం
వేదోద్యానవనీ విహార రసికాం విశ్వాంతరోల్లాసినీమ్
వీణావాదన తత్పరాం శ్రుతి శిరోవిన్యస్త పాదాంబుజాం
వందే త్వాం కరుణాసుధాలవకిరన్నేత్రాంచలాం మాతరమ్.

(1941)

సౌందరనందము

తేనెలువాఱు వాకలయి తీయని షట్పద గీతికా మధు
శ్రీనివహమ్ముగనట్లె విలసిల్లెడు సౌందరనంద మాధవో
ద్యాన రసాల పల్లవ రసాతికషాయిత కంఠ కోకిలా
నూన కృతజ్ఞతా మృదు మనోహరగీతిక లాలకింపుమా.

(1941)

జూట శశి

సాంద్రతమః ప్రమర్శన కృశద్యుతి లక్షితవైన మన్మన
శ్చంద్రిక! యీ 'అమాస' తతై బలిసెన్ దెసలంచులందు; భి
న్నేంద్ర మణిప్రగాఢరుచి; నేగవె! మాటుమణింగిపోవ, నీ
రంధ్ర గిరీశ 'జూట శశి' రాల్చిన చల్లని పిల్ల వెన్నెలన్.

(1942)

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

దిగ్దంతి సాంద్ర మదగంధ విహాసికీర్తి
శ్రీ చందనేన సమలంకృత దివ్యదేహమ్
భాషావతార మఖిలావనిపాల మౌళి
సంసేవ్యమాన పద పంకజ మానతోస్మి॥

అనయంబున్ భవదీయ దివ్య కవితావ్యాహార మాహారమై
తనరన్ తావక దర్శనార్ధ మహిరాట్తల్పంబుపై మేను వా
ల్చిన శ్రీనాథుని కోస మా ధ్రువుని వోలెన్ దేవ! యిన్నాళ్లు నా
యొనరింపంబడు భావనాతపము లోహో! పండె నీ రాకచేన్॥

ఎవియో కాని యెఱుంగరానివి కదే! యీ నన్ను గారించు బాం
ధవముల్ తొల్లిటి జన్మలోని వనుచున్ తర్కింతు నో స్వామి! నే
డవితర్కమ్ముగ దర్శనంబిడితి వాహా! పండె భాగ్యంబు కం
దొప కత్యంత సుఖైక దర్శనుడ వౌదోకావొ! యంచెంచితిన్.

(1942)

సింహ వాహన

ఈ యధర్మోద్ధతి నినమండలము దీప్తి
తరిగి చీకటిచాలు పరిచె దెసల
నేతస్మహాంధకారాతతమై విశ్వ
మల్లాడి యెలుగెత్తి యలమటించె

జాతవేదశ్శిఖా సందోహములు మింటి
కెగసి యుదుద్యుతుల్ పొగ మునింగె
నురలి పాథోభర్త యుద్ధత వీచి హ
స్తములు వేవేల్ వసుంధరను జుట్టె

ఈ మహాభూత నివహంబు, లేచి- యొక్క
పరిగ దొరకానెనేమొ విశ్వప్రళయము
సేయ! నిదియేమి హేతువో! ఈ యకాల
విలయమేతెంచి డిందు నిట్టుల జగంబు॥

(1943)

జలధి శీకరము

కలదు కనువిప్ప దొల్లి నే కలశ జలధి
యాకసము నంటి మన్నయనాగ్రసీమ
కాలమట లేదు దిగ్విభాగంబు లేదు
జలధి గర్భోత్థిత పయస్తుషార మేను॥

తెరలి యిట వచ్చి పడితి రాత్రిం దివావి
రత మహాయాత్ర నీ, దిగావృత ధరిత్రి
మలగి నాస్మృతి యిందు నే మన్న బ్రదుకు
నిరవధిక దుఃఖయాతనాభరితమయ్యె॥

ఆ సుధాసింధు శిశిర గర్భాంతరమున
కెన్నడో నా పునర్యాన మెఱుక పడదు
ఇచట వేగింతు నాప్రొద్దు లెద గరంప
జలధి వేలానిలోదిత స్వాదుగీతి॥

(1946)

ధ్యాన దేహళి

నిరవధి వియ్యద్విహారేచ్ఛ నీడ భూమి
వేగియుంటి పక్షోద్గమ వేళ దనుక
అలసి నేడు లోకాలోక యాత్ర మఱలి
మత్కులాయాంత నిద్రాసమాధి వలతు.

వితత మోహ తంద్రాభరానతము లిపుడు
నా గరుద్రేఖ; లొరసె ననంత గగన
జలధి భూధర కానన శ్యామరేఖ,
లలస పవనాహత స్వన దంచలముల.

శ్రమ నిమీలిత లోచన సరణి నిరులు
గవిసి క్రమశో విలుప్తము లవియె! మత్ ప్ర
చార వలయాంక భూషితాశా దశాంత
రాళ మాలోక పూర్ణవేలా పయోధి.

సరవి నిట్టి యాతాయాత పరిధుల బడి
శ్రమ విలులితము ప్రతి దివస పరిణామ
వేళ నీ నీడ దేహళి వ్రాలు నాదు
ప్రాణ, ముచ్ఛ్వసిత పురాణ పత్రమటుల.

బంధుర సుషుప్తి యోగ నిష్పందవృత్తి
నూని నేడిదె గళిత దివానిశా వి
మోహమతి నౌచు నాలోక పూర్ణపథము
లంటి చనియెద ననివర్తనాయతనము.

1952

పితృతిథి

లిపి సమభ్యాస దినముల యపుడు నేను
దిద్దుకొన, కమ్మనెంతొ వేధించినాను
చెప్పవమ్మ! సముద్రమ్ము చెఱువు కన్న
చిన్నదా? పెద్దదా? నాకు చెప్పుమనుచు॥

చిన్ని నాకేలు మీకనిష్ఠిక సమర్చి
నన్ను గొని చూపితిరి నాడు మిన్ను లొరయు
నల మహాజలరాశి యనంత మనుచు
విరియు పసికన్నులందు నచ్చెరువునిండ॥

కావ్యశిక్షాదినమ్ములు గడచి నిరత
భావనా వశ హృదయ విపచ్యమాన
వాసనా దుగ్ధ పరవశ భావమొందు
తరిని 'మఱువకు'మని చెప్పి తరలినారు॥

గళిత సాధన పథమై ప్రగాఢ మోహ
వివశమై తండ్రి! మీ పర్యవేక్షణమ్ము
తప్పి దెసమాలు మజ్జీవితమ్మునందు
చెలగి యొకనాడు మిము దలంచినది లేదు॥

నే డమావాస్య- మున్నీటి నీట గలుప
వచ్చినాడను పితృభుక్త భాజనముల
కబళిత నభః కటాహాంధకార విలయ
జలధి! మీ కోపమరసి విహ్వలుడనైతి॥

(1955)

ప్రతీప గతి

పలుకుల దలంపులను నడవడిని 'నాకు'
నభిముఖముకాని యీ నా ప్రయాణమందు
యంత్రశిక్షానిరుద్ధ దుష్టాశ్వలీల
నీడ్చుచున్నవి నన్ను రేయియును బవలు॥

నిర్జిత స్ఫూర్జథూద్దామ నేమి మృత్యు
ఘోషమున గుండియల్ కలగుందుపడ, న
తోన్నతాధ్వమ్ములందు వైద్యుత జవాతి
నీయ మానమ్ము రథ మస్మదీయ తనువు॥

జలధి పారమ్మునకొ! నభ శ్చరమసీమ
కో! నిరంత మరుస్థలికో! మదీయ
దేహరథ మీడ్చుచుండె రాత్రిందివములు
భయద రయధోరణీ పరస్పర జిగీష॥

అనధిగత గమ్య, మీ నా ప్రయాణమందు
కలదు పర్యుత్సుకత కొంత, కలదు దుఃఖ
జడతయు; సతీత రమ్య విస్తార విషయ
కల్పిత క్షణిక స్నేహ కాతరమును॥

స్థపుటి తాధ్వం, బయంత్రితాశ్వములు, విప్ర
తీప గతి; యీ రథంబు నేతీరమునకు
దేరనున్నవొ! యన్న యుద్వేగమేల?
అది యెచటనిల్చె శాంతి నిశాంత మచట॥

(1956)

ం

కాటూరి వేంకటేశ్వరరావుగారు

ఆరంబోసిన పండు వెన్నెలలు నీహారాంబువుల్ మేల్మిబం
గారమ్మున్ దొవతేకు మెత్తనలు ముక్తాహారముల్ సాంద్ర క
ర్పూర క్షోదము గర్భకైతక దళంబుల్ కార్తికీ శాలి కే
దారశ్రేణులు రూపుగొన్న కవితా తన్వంగికిన్ భద్రమే॥

భద్రమే సుందరీనంద భావపరిధి
వెలుగు ప్రణయార్చి చిదిమి దిగ్వలయ తమము
లొత్తిగిల మణిదీపిక లెత్తు మీ ఫ
లానుమితమైన సుమహితారంభమునకు॥

పౌలస్త్య దుఃఖ బాడబ
మాలాకీలార్చి నెడద మన్నించిన యీ
తాలిమికి నాటుపోటులు
వేలాతిక్రమము లేని విధ మచ్చెరువౌ॥

అనవరత కావ్యశీలన
జనితోత్కళికాసహోతి చంచల మతినై
నిను వెదకికొనుచు నేనొక
దినాంత మం దరుగుదెంచితిన్ బసినాటన్॥

నీ యనుభావ మదెట్టిదొ
మాయురె! నినుగన్న పూర్వ మహితాంధ్ర కవీ
శాయత తేజస్సన్నిధి
యై, యెద మ్రొన్పడి వినమ్రతాయత్తము కాన్॥

నీ కడకంట నివ్వటిలు నెయ్యము తియ్యన, నాడు మున్నుగా
నా కనుభూతమై దినదినంబునకున్ దటితీపు లొచు మా
ద్వీక ఝరంబుగా నిగిడి, వేల్పులవాగయి మేరకందమిన్
శీకరవృష్టిచే బరవశించుట మాత్రము, యే నెఱుంగుదున్॥

ననుగైకొన్న కృపావిశేషమునకున్ నానా కవీశాన కా
వ్య నిలీన ప్రతిభామయ ప్రకటరూప ప్రాపితోదార ద
ర్శన భాగ్యంబునకున్ హితత్వమునకున్ స్వాదుప్రియాలాప వ
ర్తనకున్ దైశికభావ సంపదకు దెందంబందు కై మోడ్చెదన్॥

(1957)

సుప్త దీర్ఘిక

కొల నిమ్మెయి కరణములను
నలగుల తెరువడిచి యే ననాదిమ నిద్రా
జలముల నంచులు మోపగ
నిలువు నిలువు దాక లోన నింపితి దీనిన్॥

వివృత కరణ సరణి శివ! జగత్రుత్యయ
మలిన వారి నిగిడి కలుగునేమొ
కొలను; విమల కమల కుముద కంఠ ప్ర
తానాభిరామ జఠర మని తలంచి॥

చిర తమో జలౌఘ శిశిర తమస్పర్శ
మునిగి యణగె కరణముల తమంత
ఈద తాకి గూటి యెద పులుంగుల వోలె
నెగయ రాక తెలివి యెల్ల లందు॥

అలవి యగునె నాకు నస్వప్నమౌ నిద్ర!
విరియునొక్కొ కమల వీథి యిందు!
లయవిధాయి రయచలత్ జలభ్రములందు
వివృత వక్త్ర నక్ర విహృతు లందు॥

అరిగి యరిగి లోని కబ్జనాళాంతర
విమల గర్భశయ్య విశ్రమింతు
అలమి యచట నన్ను నస్వప్నమౌనిద్ర
విరియుగాక కమల విపిన మిందు॥

(1958)

విశ్వనాథ సత్యనారాయణగారు

పాతాళాంతర గర్భనిర్భర తమఃప్రాగ్భార నిర్భేదియై
జ్యోతిఃస్వర్ధు వహో! మహఃకబళిత వ్యోమాఖిలాశాంతమై
యేతేరన్ బరిషత్తు తీర్పబడె బ్రాహ్మీభావనుల్ రారయా!
గౌతమ్యాపగతీర ధారణికి వాక్సత్రామృతాన్నార్ధులై॥

ఇంధానాక్షి నొసంట దాచు నహిమంజీరంబు, ఛన్నేందు సం
బంధ జ్యోతి రుదారమౌళి, గళసీమారుద్ధ భాషాపయో
మంథాన ప్రభవాగ్ని, దైవత జగన్మోహపయస్స్వాధు గీ
స్సింధూత్తంభిత కల్పవృక్ష సుకవి శ్రీకంఠ తేజం బహో॥

ఉదితైణాంక మనోజ్ఞ మౌళితలమై యోషాపుమాకారముల్
కదలన్ మాటికి గచ్ఛపీ మధుర నిక్వాణంబొ! మౌర్వీలతా
ఘ్యుదితౌంకార నిరంతర శ్రుతియొ! సమ్మోధేంద్రియ గ్రామమై
మదియెల్లన్ శివశారదాద్వయ మహో మగ్నస్థితిన్ మ్రాన్పడెన్॥

నతులర్పింతు పురాణ జిహ్మగ ఫణాంతః ప్రత్న రత్నాగ్ర దీ
ధితి కిమ్మీరిత సాధువర్ణ పదవీథీ ప్రౌఢశయ్యా పరి
ష్కృతి సంభార ధురావిరాణ్మయ మహఃశ్రీ విశ్వనాథోగ్రధీ
కృత రామాయణ సత్యవాఙ్మధుర సాహిత్యేందిరా స్వామికిన్॥

జయజయ! పూర్వ మహాంధ్ర కవీంద్ర వచఃక్రమ చంక్రమ సాధుకృతీ!
జయజయ! వేదశిరః ప్రతిపాదిత సార మహార్థ నిరూఢ మతీ!
జయజయ! రూక్ష నిటాలతటీ నట శైవమహః పరివేష ధృతీ!
జయజయ! సర్వదిగంత మహా పరిషత్పరిపూర్ణ మహః ప్రసృతీ॥

(1960)

భద్రకాళీశ్వరా!

నీపేరన్ బ్రభవించె దమ్ముడితడున్, నీ వింటివేల్పౌదువన్
ప్రాపై నీవు కులాస మాకు నెగడున్ పారంపరీ భద్రముల్
మాపాలన్ దురితంబు లెన్ని కలవో! మద్వంశదైవంబ! నీ
వే పాలింప దలంపవేని గతియేదీ? భద్రకాళీశ్వరా॥

అన్నల్ నల్వురు తమ్ముడీయొకడు వీడన్నన్ బహిఃప్రాణమౌ
త్వన్నామాంకమొ! తన్నిమిత్త మనుజత్వప్రీతియో నే నెఱుం
గన్, నాయందున నన్న లిట్టిరె సుమీ! కారుణ్యవారాశి! నీ
పన్నాళీక సమాశ్రితంబు కులమప్పా! భద్రకాళీశ్వరా॥

నీ వింట న్నడయాడు నాళ్ళెఱుగనే? నిత్య ప్రసన్నుండవై
సేవాహ్వానము విన్నయంత జననీ సీమంత ధూమోద్గమం
బై వీరాసన సన్నివిష్టమగు వ్యోమాంగంబు, ఖడ్గంబు మద్
భావారూఢములయ్య! యెన్నటికి భద్రా! భద్రకాళీశ్వరా॥

కృతి నిర్మింప దలంప; నేటికి త్రయస్త్రింశాబ్దమున్ దాటి, సన్
మతి భావింప దలంప భక్తజనతా మందారమున్ నిన్ను నా
బ్రతుకిట్లై జపియింపనొల్లనుజుమీ పంచాక్షరంబైన సద్
గతి దవ్వెంతదయా దయాగుణసముద్రా భద్రకాళీశ్వరా॥

జనకుండీయనిదేమి? వంశమొ సదాచారంబొ మంత్రంబొ ప్రా
క్తన నిష్ఠానియమంబులో శివపదధ్యానైకతానాత్మయో
వినుతింపన్ దలపైన, నిన్ను కవితావేశంబు నన్నొందదే
ని ననుంజెందిన మత్పురాఘమిది తండ్రీ! భద్రకాళీశ్వరా॥

ప్రాయంబో సగమాయెనింతకు, భవత్ పాదారవిందార్చనల్
సేయంబో నొకనాటికేనియు, భవచ్చింతాదరిద్రంబుగా
నాయెంబోమది నాయనుంగు, వెడగైయల్లాడ నీపేరటన్
న్యాయంబో కులదైవతంబువయి భద్రా భద్రకాళీశ్వరా॥

పారాడన్ గృహ దేహళీతతి, శిశువ్యాజంబునన్ నిన్ను నా
గారామంటినొ? దోరుదగ్రధృతి ఖడ్గస్ఫారధారా క్రతు
క్ష్మారంహఃకృతతాండవోచ్ఛలిత సాక్షాద్వీర భద్రావతా
రా! రారయ్యరొ! యంటినో? తలపు భద్రా! భద్రకాళీశ్వరా॥

చూళీబద్ధ జటాకుడుంగ నివసచ్ఛూలీ! కనద్ఘోర దం
ష్ట్రాళీ! సర్వ జగజ్జయోన్నత భుజావ్యాళీ! ప్రధావన్మరుత్
పాళీ నిర్ఘృమదగ్నిదృగ్ భుగభుగత్ ఫాలీ జ్వలజ్జ్వాల మా
లీ! లోకాద్భుత ఖడ్గచంక్రమణ కేళీ భద్రకాళీశ్వరా॥

దురితారణ్య కుఠార దుర్జన మనోదూర స్థితాచార సం
సరణాంభోనిధి పార దారుణ విపన్మగ్నాశ్రితోత్తార శ్రీ
చరణాంభోజ విచార సార ధిషణా సంచార ధారామనో
హర వర్షాదిన నీల నీరధర ధీరాకార కాళీశ్వరా॥

శూలాసంగ మహోత్తమాంగ విలసజ్జ్యోతిర్మహాలింగ చిత్
లీలాకల్పిత యజ్ఞభంగ జయఖేలత్తాండవాభంగ స
చ్ఛీలోద్యచ్ఛ్రిత మందిరాంగణ సరచ్ఛ్రీమత్ కృపాపాంగ శ్రీ
తాళక్షేత్ర కృతానుషంగ హృదయాంతః సంగ కాళీశ్వరా॥

శోణారీణ సరస్వతీక్షరదసృక్శోణంబు, ధావజ్జగత్
ప్రాణప్రాణము, భక్తలోక ధృత సంత్రాణంబు, శుంభత్ కృపా
ణం, బుజ్జ్వలకీర్తిశాణము మఖశ్రీ ధ్వంసనోద్యద్గణ
శ్రేణీప్రాణము, నీకృపాణము శ్రితార్తిచ్ఛేది కాళీశ్వరా॥

శూరోత్తంసమ వచ్చె గౌతమి గళచ్ఛోణాంబువేణీ పరి
ష్కారోదగ్ర మనోహరాకృతి భవచ్ఛైలాంఘ్రి పీఠస్థలిన్
జేరన్, జెందిర కావి చెందర క్షరచ్ఛ్రీమత్ కృపాణాగ్ర ధా
రారక్తవ్యతిషంగపేశలత, భద్రా! భద్రకాళీశ్వరా॥

పాకారి ప్రముఖాత్త హవ్యము, సతీప్రాప్తాగ్ని సాత్కారమున్
వ్యాకీర్ణస్థితి వచ్చి చెప్ప గణముల్ పతీ విదాహోన్మనః
శ్రీకంఠోగ్ర జటా నిటాలకలిత స్వేదోద్భవంబైన మీ
యాకారంబె శుభంబు మాకిడుత భద్రా! భద్రకాళీశ్వరా॥

పరిదోవిద్యుద మోఘ మేఘపరిషత్ ప్రాగ్భారదేహాయ తే
పరిమాణేతర హేతిదీధిత చలద్బాహా సహస్రాయ తే
కరుణాంభోనిధయే నమోస్తు శ్రితరక్షాగాధదీక్షాముహు
స్త్వరమాణాయ నమోనమోస్తు భవతే భద్రాయ కాళీశ్వరా॥

రుద్రాయామితేజసే నమ ఇదం రౌద్రావతారాయ తే
భద్రాయైన నమోనమస్త్రి జగతీ భద్రాయతుభ్యం నమో
మద్రక్షాపరమాదరోదిత కృపామంజు ప్రభాతాగమో
నిద్రాంభోజదృశే నమఃశివ నమస్తే భద్రకాళీశ్వరా॥

రౌద్రాకారత మమ్మలంప నిది మేరా! నీకు లోకత్రయీ
భద్రాకార! భవత్పదాబ్జయుగళీ ఫాలస్థలీ ముద్రలన్
మాద్రోహంబు తలంపకే మఱువకే మాతండ్రి కారుణ్యరే
ఖాద్రాఘిష్ఠ నవారుణాంబుజ కటాక్షా భద్రకాళీశ్వరా॥

నిద్రాముద్రదొలంచిచూడు విదళన్నీ రేరుహాంతస్సుధా
ముద్రాభద్రము నీ కనుంగొలకులన్ బొంగారు కారుణ్యమ
ద్రిద్రాఙ్నిర్యదభంగనిర్ఝర సమోద్వేగంబు వర్షించి కుం
భద్రోణంబుల, నోలలార్ప నద, నప్పా! భద్రకాళీశ్వరా॥

భరమా! మాదృశ కింపచానకృత దుష్ప్రారబ్ధముల్ దూల్ప న
ధ్వరవిధ్వంసనగాఢకేళికి? శ్రితాంతస్తాపమున్ బాప న
బ్బురమా! సర్వ జగచ్ఛరణ్యశివహృత్ ప్లోషోరు తాపైన్ని
ర్ధారణారంభ విజృంభ మాణునకు? భద్రా! భద్రకాళీశ్వరా॥

ఛలితస్వాంత శివాపరాధి ముఖశిక్షావేశ మెంతయ్య? వి
హ్వాలిత స్వాంత పదానురోధి శ్రితరక్షావేశమంతయ్య యూ
ష్మలమెంతయ్య? శివేతరాధ్వగముఖక్ష్మావీధి, మాయయ్య శీ
తల మంతయ్య! నిజాంతరంగమున భద్రా! భద్రకాళీశ్వరా॥

ఒడయండా! మదిలోన నీవు దయ నన్నోమంగ నూహించితే
తడవేలయ్యర యంతకంత బహిరంతర్ గ్రీష్మమై భీష్మమై
యెదరేచెన్ సుడిలేచె బ్రాణములలో, నేనుంటి నీకంటి మిం
ట, దయచ్చాతక రీతి వావిడి కృపార్ద్రపూర్ణ కాళీశ్వరా॥

సదయాంభఃకణ నిస్సరత్ స్మితకళా సౌదామనీ దీప్తితో
మద కుంభీంద్ర సమానయాన విచలన్మంజీర గర్జాళితో
ముదిరానీల మనోహరాపఘన! సమ్మోదంబుమై వచ్చి నా
హృదయక్షేత్ర నిదాఘ మార్పగదె! ప్రావృణ్మూర్తి కాళీశ్వరా॥

శింజానాంఘ్రితటీ లురర్చిద మంజీరాగ్ర ఘంటాధ్వనుల్
గుంజన్మంజుల బంభరార్పటి నెదుర్కో మద్విపన్నీరభృత్
ఝుంఝూవంధ్యరయప్రభంజన సరత్ ఝంపాగతిన్ బాలనో
ద్యుంజానాకృతి వచ్చియేలు మనుకంపానిద్ర కాళీశ్వరా॥

కాలాకార భవాంధకాఖ్య దితిజోగ్రగ్రాస లిస్సామిళత్
క్ష్వేళాభీల ముఖాంతరంబున భయోద్విగ్నైక ఘుగ్ఘుస్థితిన్
కాలార్పన్ గయియూర్చ జాలనుగదే కారుణ్య లీలాతటిన్
మాలాసుస్థిరదీప్తి నావెఱయిరుల్ మాయించు కాళీశ్వరా॥

తాలోత్తాల విపత్తరంగ భయదోద్యజ్జన్మవారాశిలో
నోలాకుంబడి, వెల్లకింతలయి, మగ్నోన్మగ్నతన్ గాఢభీ
త్యాలీఢాఖిలచేతనుండనయి, మద్దైవంబ ద్వీపంబుగా
నాలంబించితి నిన్ను, దవ్వు చనకయ్యా భద్రకాళీశ్వరా॥

శిక్షారుద్ర జగల్లయాంతముల ద్వత్ క్ష్వేళాసముద్ధాట్టహా
సక్షోభంబున బద్మజాండమవియున్ జాగ్రద్భవద్దోశ్చలత్
కౌక్షేయాగ్ర ధళంధరా చకితులై కన్నారయా వేలుపుల్
త్ర్యక్షద్రోహఫలంబు జన్నమున భద్రా! భద్రకాళీశ్వరా॥

రక్షభద్రుడవై నిలంబదుమురా రారా! క్రమక్ష్మానటత్
త్ర్యక్షాకార! విపక్ష పక్షము పరాస్తంబయ్యె దక్షాడిగా
నుక్షస్కంధ నిషణ్ణులై శివులు నేదూరేగనున్నారు త్వత్
కౌక్షేయ ప్రతిబింబితాకృతులు భద్రా! భద్రకాళీశ్వరా॥

అంసోల్లాసి మహాసిదీధితి వియద్వ్యాప్తంబుగా, మేఖలా
సంసత్సంకుల కింకిణీ కిణికిణి స్వానాస్ఫుటాలాపయై
హంసీయానముతోడ గాళిక కదే యాయమ్మ, మద్దైవతో
త్తంసంబుల్ కరుణింప వచ్చితిరె భద్రా! భద్రకాళీశ్వరా॥

స్వాహానాయకు నాల్క లంటదెగి, పూషాదిత్య పండ్లూడి త
న్నీహారద్యుతి కందిడింది, తెగి వాణీవాస, నెమ్మె, తురా
సాహండోహటిలన్ నటింప గణముల్ సాహో నినాదార్భటిన్
"త్రాహి త్రాహి" ఘటింపవే విధికి? భద్రా! భద్రకాళీశ్వరా॥

ధూతాస్మత్ కులవృద్ధ పుణ్యచరితాందూబంధ మంధేంద్రియ
వ్రాతారణ్యతృషావశానుస్మృతి, ధీరస్వైరయానంబు ని
ద్రాతంద్రాళు, వపాస్తభక్తి, మదగంధవ్యాపృదాశంబు మ
చ్చేతోమత్తగజంబు లోగొనవె! మాష్టిడొడు కాళీశ్వరా॥

తమ మంతంతట గచ్చువిచ్చి, చిరనిద్రాముద్రితంబైన చి
త్తము తేకెత్త, నిరూఢ ధీజడమ డిందన్, గందళింపన్ బ్రబో
ధము క్రొత్తావులయావి, లోయెద మరందస్యంద మయ్యేన్మహా
ప్రమథస్వామిని వేవెలుంగవుదె! భద్రా! భద్రకాళీశ్వరా॥

నిలుమొక్కించుక నాహృదబ్జమున బన్నీరేరుహంబాది నిన్
జలకంబార్చెద లోచనాంబు వినిమజ్జజ్ఝాటిగా, భక్తి న
ర్చలు గూర్తున్, ధృతి వీరగంధ మృదుచర్చల్ దీర్చెదన్, ధ్యాన ని
ర్దళితాహంతయె నారికేళ, ముపహారంబిత్తు కాళీశ్వరా॥

పదియేండ్లప్పటి కైతకైన బలికింపన్ జాలుదున్నిన్ను ని
ర్వదియేండ్లప్పటి మాటకైన గరగింపన్ జాలనో నేడు ము
ప్పదియై, లౌకిక వాసనా కలుషిత స్వాంతంబునై చిట్టి నా
పదయై నీకృపరామికై వగతునప్పా భద్రకాళీశ్వరా॥

మృద! యుష్మత్పదనీరజస్మృతి కళాహీనంబులై వేకువల్
చెడె, బ్రాహ్ణంబు లడంగె, మాసెను దినశ్రీ, సంధ్యముస్ వంధ్యమై
నడచెన్, లోయెద గ్రమ్ముచున్నది భయాంధ్యం బెంతలో తెల్లవా
రెదు? నన్నెచ్చట నిద్రలేపెదవొ! తండ్రీ! భద్రకాళీశ్వరా॥

ప్రహరిన్రండు గణంబులార! మతిధారా! శ్రీకృపాణీ! చతుః
ప్రహరంబుల్ నిలుమమ్ము దీపకళికాభన్ భద్రకాళ్యంబతో
విహరింపన్ దయచేసి యుండెనట! శ్రీ వీరాధివీరుండు, నా
దహరంబందున, భద్రమెల్లపుడు భద్రా! భద్రకాళీశ్వరా॥

(1961-62)

కీ.శే. కాటూరి వేంకటేశ్వరరావుగారు

కడుపున బుట్టనన్నది యొకందు కొౙంతయెకాదు, నెమ్మదిన్
గొడుకుల మీదనైన దనకుంగల కూరిమి యెట్టిదో వినం
బడదెపుడే, నదెల్ల శరభయ్య యెఱుంగు నొకండె, నేటికిన్
బదుగయినాడ, దాదృశ కృపామహితాత్ముని బాసి మద్గురున్॥

ఏ సుకృతంబు నా యెడ ఫలించియొ నా పసినాటి వేకువన్
దేశిక భావమందున బ్రతిష్ఠితమైన వెలుంగు; ఆంధ్ర వా
ణీ సదనీకృతాసనము నిల్చిన దిర్వదియేండ్లు, నేటి, కా
నా సుకృతంబు దవ్వుచనెనా మనసా! యిక జోగినై ధరన్॥

వింశత్యబ్దములేగె నిన్నుదొలుతన్ వీక్షించి, నాకుంద్రయ
స్త్రింశాబ్దంబిపుడైన, నేరనుజుమీ! శిష్యత్వమో సఖ్యమో
భ్రంశంబయ్యె వయోవిభేదము భవద్భావామృతాంభోనిధిన్
బ్రాంశూదాత్తమనీష నే గనిన నిర్వాణం బనిర్వాచ్యమై॥

నీతో నేర్చితి, నాంధ్రగీఃపికవధూనిర్హ్రాదముల్ స్వాదువుల్
నీతో వెన్నెలరేల బండితి, హిమానీస్వచ్ఛలన్ శయ్యలన్
నీతోడన్ బడిరాను స్వర్గపురికిన్ నీవేగి, తాంధ్రీ వచ
శ్చేతోజాతుడ వచ్చుటన్ సురవచశ్రీ బాళిమైనున్నదో॥

అనువర్తించితి శిష్యునిన్నను, గురుండైయుండియున్నీవ ని
న్ననువర్తింపన, శిష్యుడంగద! గురున్ హార్దైక వారాంనిధిన్
నను నోనాడి యెఱుంగవెన్న, డిచటన్మర్మంబు నీ నా యెఱిం
గిన, దెవ్వారి, కగమ్య, మాశుభమతిన్, గీర్తించెదన్ మద్గురూ॥

నీ యనురాగ దివ్యమధునిర్భరశోభ దలిర్చియున్న నా
ప్రాయమునందు నామనియె రాదిక యెన్నటికిన్, దురంత తా
పాయితమౌనిదాఘమొ, జడాయితమౌ శిశిరంబో, జీవిత
వ్యాయతియెల్ల వట్టి బయలై దిగులై నొగులై భరంపడెన్॥

నీ చనుత్రోవ నిర్ఝరవనీ వ్రతతీ నిపతల్లతాంత ధా
రాచితమయ్యె సమ్మదభరస్నుత దివ్యగవీపయస్సుధా
సేచితమై ప్రహర్ష వివశీకృత దివ్యవనీ వనప్రియా
ళీ చిరరుద్ధకంఠకుహళీ విగళన్మధునిర్భరాశమై॥

(1962)

మహానుభూతి

చిరహేమంత దశావిశీర్ణ తనుయష్టిన్, పాండురీభూత మ
ర్మర పత్రచ్యుతి మ్రోడువాఱితి, భవన్మార్గంబునన్ నీవు చై
త్ర రమాదేవత, వింత చేరగనె యంతఃప్రాణనాళీ విని
ర్భర మాధుర్య మహానుభూతి మెయి స్తంభంబేర్పడెన్జు మ్మిటన్॥

సుధ నాప్యాయితమైనటుల్ తను మనస్సుల్ రెక్కొనన్, పూర్ణిమా
తిథి యేతెంచుగతిన్ ప్రసన్న మృదుదీప్తిన్ దవ్వులన్, లోచనా
తిథివై వచ్చెడి నీ యుదాత్త శుభమూర్తిన్, దగ్గఱన్ జాలకే
పథ మల్లంత దొలంగి నిల్చితి జుమీ! పారిప్లవచ్చేతసన్॥

లో వెలి నెన్నడున్ విడక లోగొని యెల్లెడ నీవె నిండియున్
నీ వెదురౌటయే కలుగనేరదు, నా చనుత్రోవ నెన్నడున్
భావ సుధాబ్ధి వీచికలపై కలపై నడయాడు నీవొ! యీ
నీవు మఱీవొ! యే నెఱుగనేరక సూవె! తొలంగి నిల్చితిన్॥

నీ రాకన్ గనినంత లోయెద యెదో నిర్మథ్యమానాంతర
క్షీరాంభోనిధి గర్భవీథిమయి లేచెన్, వీచి యువ్వెత్తు; జ్యో
త్స్నా రారాజ దనంత పూర్ణశశి లిప్సావ్యగ్రమో కాక తద్
భారం బోర్వగరాక, యే దొలకితిన్ పర్యంత మర్యాదకున్॥

సమలెన్నేని గతింపనిమ్ము ప్రథమాశారాగముందోగి, బిం
బమవై యే, తొలినాట నిట్టి మధురస్పందంబు, నా నిండుడెం
దమునన్, జాబిలి వోలె నూచితివో స్పందం బద్దియే సుమ్ము దై
వమ వోలెన్ నినుగన్నవేళల మదిన్ వైవశ్యమున్ గూర్చెదున్॥

(1964)

చిర నిరీక్షితాతిథి

మత్ పరధ్యాన మేమందు! మార్గమందు
త్వ త్పరధ్యానముద్ర నా తలపు నిండి
అరుగుచుంటిన; నా యఖిలాధ్వములను
అఖిల వేళలయందు నెట్లైనగాని
నీ వెదురు వచ్చుటదికల్గునే!! యటంచు
ప్రాణమున కంటి పరిదుర్బలాశ - యొకదు॥

కడచి ఎన్నేని యుత్కళికాభరమ్ము
లరిగి మజ్జీవితానేహ మంతనంత
నీ వెదురె రావొ! బ్రదుకు లెన్నేని గడచి
అణగె నాయాశ భస్మసుప్తాగ్ని యగుచు॥

నా సుకృత లేశమేమొ! జ్యోత్స్నాయమాన
మయ్యె నేడిదె మన్నయనాగ్రసీమ
ఓ చిర నిరీక్షితాతిథీ!! ఓపజాల
నీ యెదుట నిల్వనైన॥

(1965)

నీ వెవరు

నీ కభిధ లేద; ఒకటను నిన్నెఱుంగ
రాద నీ మూర్తి అవిదితస్వాదువెదియొ
కేవల వ్యంజనవుగ మద్భావ నిభృత
గేహళిని నిల్చి నను ప్రతీక్షింతు వెపుడు॥

నీవు మత్ప్రాణ మూలంబు నెలవుకొనియె
నిస్వనింతువు కలవిపంచికయ వోలె
ఆ కలధ్వని సంస్థాన మరయరాక
నిలువనేరక నే ప్రతి నిస్వనింతు॥

నీవు నాలోనె కనరాక నిలిచి యెందొ
విధుర భావప్రపంచంబు విస్తరించి
తలచిన తలంపు పలికిన పలుకు నమృత
సించితంబుగ కృప విరచించుచుందు॥

నీవు నాయందె సుచిర నిర్ణీతవయ్యు
అలసితెందెందొ గ్రీష్మశైవలిని వోలె
నీ యవిజ్ఞాత హృదయభరాయతోష్మ
మంద మందోచ్ఛ్వసితమె నామది నదింప॥

నీవు నిద్రాళు మచ్చిత్త నీరనిధిని
నర్తన మొనర్తు, వవిరతావర్తశోభ
నెగయ శీకరములును, డిండీరములు, న
భంగ భంగమ్ము, లతల గర్భగత మణులు॥

నీవు లోలో జపారాగ నిభృత శోభ
నావరించితి మచ్చరమాశయెల్ల
లీన మద్భావ గగనాధ్వనీన శత స
హస్ర తారలు తెరతీసినట్లె వెలుగ॥

నీవు పవలెల్ల మత్ప్రాణనిలయలీన
వగుట కన రాక నాకు నిశాత్యయముల
నిగిడి యొక్కింతవడి రజనీముఖముల
లీల వెలిగింతు వమృతాంశులేఖ వగుచు॥

నీ వఖిల శబ్దశక్తి నిర్ణీతి సార
ధీ ప్రమాణవు రస జగజ్జీవనమవు
నీ కృపాపాలితంబు మన్నిఖిల కావ్య
నిర్మితి సమీహమాన మనీషయెల్ల॥

(1965)

'నీవు రావేని - ధరణికి'

నిన్ను - నా శైశవమునాడు నిరతకావ్య
జలధిమథనావసాన ప్రశాంతసంధ్య
నరయ దిగులయ్యె గగన దూరాంచలముల
నలతి నెలవంక డోల నుయ్యాలలూగ॥

అమర వాణీ ప్రణీత కావ్యామృతములు
కరువునంబోయ నామది; కరడుగొనుచు
నిగిడి నీమూర్తి మిన్నుల నిలిచె; గళిత
బహుళ భయ నిత్యశారద తుహిన రుచిగ॥

లబ్ధి గగనమ్ములను దాటి యవలనున్న
నిన్ను చేరంగరాద, నా, కెన్నడైన
మిన్ను డిగి నీవె వత్తువోయన్న యాశ
అబ్ధి గగనమ్ములకునైన నాగరాదు॥

ప్రతి దినాంతమ్ము ఘుసృణప్రవాళశోణ
చరమ గగనాధ్వముల భవచ్చరణముల శ
శాంక డోలా చలాచలోచ్చలిత కింకి
ణీ నినాదంబె నాయెద నిర్మథించు॥

నీవు రావేని ధరణికి - నిర్దళన్మ
దీయహృచ్ఛోణితమున, ద్వితీయసంధ్య
నావహించెద నరుణ వర్ణాభిరామ
మగుచు నీ మూర్తి నాయెద హత్తికొనగ॥

(1965)

నా స్థితి

నా స్థితి యిదేమొ! శీర్షదఘ్న హిమపాత
లీన హేమంత చిర నిశా స్థాణువనగ
ముకుళితాళిక నయనమై మూర్ధ గగన
నిహత మిహికాంశు రుచి లవోన్మిషిత మగుచు॥

ఛన్న మౌళి శిలాభ తుషార ఘటల
నిటల బర్హిః ప్రదోహంబు నెట్టుకొనక -
విలులిత మృణాళతంతు పేశల సుధాంశు
సారణీరేఖ నమృతంపు జాలులేక ॥

కాలమునకైన కాలంబు కాలగళుడు
మృత్యువునకైన మృత్యువు హృదయవీథి
విలయ శీతల భావంబు నొలయజేసి
పరముడుండె సర్వక్రియా విరతవృత్తి॥

ఉత్తరంబున హిమగిరి నెత్తము పయి
అగసుత అనంగసూతికాపాంగరేఖ
యోగ నిష్ఠాంతమున బుచ్చె నూరుపొకటి
జడజగత్ ప్రాణవీథు లూష్మలతదాల్ప॥

(1965)

కానన జ్యోత్స్న

నా వనికి నామనియె రాదు; రావు జలద
మాలలును, నిత్యమిచట హేమంతమె! పయి
కలదుసైదోడు శిశిర మొక్కడు- పురాణ
పర్ణములకైన క్షణము నిల్వంగరాక॥

మఱి- అనీదృశ శిశిర హేమంతములకు
మాపు లోబడి చెల్లు సామంత మిదియు
నీ తలంపు వెన్నెల, లట నిండి రేలు
శాశ్వత శరన్నిశీథైక శాసనంబె॥

లేవు రేలివ్వి నందనాళిందములను
చైత్రరథ వీథులను రావు రాత్రులివియు
నీ విచట కాయుచుంటి నిర్నిద్రవగుచు
కానన జ్యోత్స్న వీవును స్థాణువేను॥

(1965)

పుష్కర గౌతమి

అర్ఘ్యంభోజము తేజమొక్కడు స్వయంవ్యక్తంబు సర్గోన్ముఖం
బై ధ్యానస్థితి నూన దత్తపములే అంభోమహోరూపమై
మధ్యేగంగముగా మరాళ ధవళాంధః సర్వ తీర్థౌఘ సా
న్నిధ్యంబై ప్రభవించు పుష్కరపతీ! నిర్నిద్రభద్రాకృతీ॥

సార్ధ త్రికోటి పావన
తీర్థ మహాపరిషదధిపతీ! దివ్యనుతీ
ధూర్ధరములు మాయఘములు
నిర్ధుత మొనరింపవే! ధునీకృత వసతీ॥

నీయందె నిలుతు రటవే!
ధ్యేయాకృతులై పితాళ్లు దివిజు, లజుఁడు, నా
రాయణుడు, శంకరుడు, గం
గా యమునా కృష్ణ లాదిగా నిఖిల నదుల్॥

సతత త్రైగుణ్యవశా
ద్భుత మాయాఖేలనమున మోహకళావం
చిత యగు చితికి స్వరూప
స్మృతి పుష్కరు కరుణగాక, యెటు సిద్ధించున్?

సింహస్థితుండైన శ్రీ దేవగురునితో
వఱలంగ ద్వాదశ వర్షములకు
దిరుగా; త్రిలింగధాత్రీ కంఠమౌక్తిక
దామమౌ పుణ్య గోదావరికిని
తరళదీధితులతో తెరలి యేతెంచు
పుష్కరదేవ! నీకు సుస్వాగతంబు
నీవెంట నరుదెంచు నిఖిల తీర్థములకు
సురలకు మునులకు స్తుతిశతములు

మల్లంపల్లి శరభయ్య

ఈ మహావారి ప్రవహించు నెన్నిసీమ
లన్నిసీమలు భవదీయ సన్నిధాన
బిందు బింద్వంతరాంతరావిర్భవద్ వ
ళక్ష రోచిశ్చటలు మాకు రక్ష యగుత॥

ఆయాతాఖిల వారిదేవతలతో నాతిథ్యపూజామహా
శ్రీయోగంబున సందడించెదవు నీ శ్రీవారి యవ్వారియై
మాయిండ్లన్ ధనధాన్య సంపదలు నింపన్ జూడుమీ! పుష్కర
శ్రేయోవేళల నాతిథేయ పరమశ్రీమూర్తి! గోదావరీ॥

అక్కాచెల్లెండ్రన్నను
మక్కువ నీకెంతో యంత మాయిండులలో;
ఒక్కరొకరెడసికలిసిన
చిక్కని సంబరముశోభ చెప్పనలవియే॥

నీ యుభయతీర సంస్థిత నిఖిలదేవ
తా కృపాలక్ష్మి దామర తంపరగుచు
వరలికెరలుచు నీదు పుష్కరశతంబు
కనుల జాతురుగాక నీ కన్నప్రజలు॥

చిందితి, విందునందు శశిశేఖరమౌళి సరోరవింద ని
ష్యందమవై! భగీరథ పురాత్త ధరాగత సౌరవారికిన్
ముందరొ వెన్కయో! యెఱుగబోవముగా, కల, గౌతమా శ్రమా
ళిందములందు, నీ తుఱగలించుట లెంచెద మాంధ్రవాహినీ॥

(1979)

రాజమహేంద్రవరము

ఏరాజ్యంబులు సాగనీ! మఱియు దా మేరాజులే యేలనీ!
చేరన్ నాటికి నేటికిన్ బుధులు, నిన్ శ్రీగౌతమాస్తృవాః
పూరంబుల్ సయిదోడుగా సుకవితాభోగం బవిచ్చిన్న ధా
రా రమ్యంబగు రాణ్మహేంద్రనగరీ! రాజద్యశోవైఖరీ॥

(1979)

శ్రీ వేణుగోపాలస్వామి

(రాజమహేంద్రవరము)

సోనలు సోనలై సురవనాంత లతాంత
 భరములు కుంతలభరము నిండ
భుగభుగలై ఫాల మృగమద తిలక
 సౌరభవీచు లాశాంతరముల గ్రమ్మ
భుగ్నాంచలంబైన భ్రూవిలాసంబున
 భువనముల్ సమ్మోహమున మునుంగ
సుషిరోద్గిరన్నాద సురధునీ మగ్నమై
 చేతనాచేతన ఖ్యాతివదల

కలువలను దమ్ములను నేలు క్రాలుగన్ను
లరవిరగ బ్రహ్మగీతి పరాయణమగు
దహర బృందావనాంతర విహరమాణ
మాధురికి మంగళము రసామ్నాయమునకు॥

(1980)

చైత్ర హూతి

మఱల నేతెంచితే చైత్రమా! విశీర్ణ
జీవలోక ప్రియాతిథీ! నీవె ఆజ్య
మగుచు గ్రీష్మేంధనము శరత్ హవియు నగుచు
ఇష్టి కొనసాగుబో! ఇంక సృష్టి మఱల॥

అళిగీతి స్పృహణీయముల్ సుమవధూహార్దామృతంబుల్ సుఖా
నిలముల్ శీర్ణ మహీజ పల్లవ నవోన్మేషంబులున్ కోకిలా
కుల సీమాంతములున్ మనోభవదరాకూతోల్లసచ్చేష్టితం
బులు కాంతమ్ములు జీవలోక మధురమ్ముల్ శైశిరాహ్లాంతముల్॥

జరుగ వర్షపరంపరల్ మఱల మఱల
సృష్టితరు శాఖికాగ్రముల్ చివురు దొడుగు
నవనవోదిత పద్మబాంధవ మరీచి
ప్రాచి వెలయించు క్రొత్త లెప్పటికి నదుపె॥

కలకంఠప్రియహూతి నెవ్వరిట నాకర్ణింప నెవ్వారి కీ
యళిగీతుల్! శుకశారికాపిక కలవ్యాహారమే వీనులం
దొలికించున్ సుధ! లీ సువర్ణమయ ప్రత్యూషాబ్జ బందూరయ
మ్ములకెవ్వారిట నర్ఘ్యమెత్తెదరు! సంఫుల్లాశయాబ్జంబులన్॥

ఆధివ్యాధి జరామృతి
బాధితమగు జీవలోక పరిణతిలో, నీ
గాథలె త్రవ్వి నవత్వము
సాధింపనె కవికులంపు జతనములెల్లన్॥

సమతీత స్మృతివల్లు లల్లుకొని, నాస్వాంతంబు పుష్పించు తీ
యము; లేనాటి యనుంగులో! చరమసంధ్యా మల్లికాముగ్ధ జీ
వములై నీ వరుదెంచువేళ, పునరావర్తంబులై వచ్చి – సౌ
ఖ్యము దుఃఖంబనరాని నిర్వృతి నెదంగల్పించు, చైత్రాతిథీ॥

మల్లంపల్లి శరభయ్య

నీతోడన్ ప్రభవించు పుష్పజగముల్ నిర్వ్యాజ ముగ్ధంబులై
నీ, తోబుట్టులు తేనియల్ వలపులున్ నీ వార్ద్రతాస్థానివై
నీతో -సృష్టి నవీకృతంబగు జరానీహార నిర్ముక్తమై
నీతోడన్ రసభావ నిత్యసుషమల్ నిండారు విశ్వంబులన్॥

నీ, వేతెంచెడి మార్గముల్ కిసలయానీకోల్లసత్తోరణ
వ్యావిద్ధాంబరముల్, మరంద సుమనః పాత్రీకృతార్ఘ్యంబు, లా
శావిశ్రావిత కాహళీ పికకలవ్యాహారముల్ సృష్టికిన్
భావావేశమ, నీ వనన్యజ పునః ప్రాణానిలస్పందమై॥

సుమములనె కాదహో! జీవ సుమములందు
నింపెదు వికాసముల్ ప్రణయంపు మధువు
వనములేకాదు సృష్టిజీవనము లెల్ల
జీవశోభాదరిద్రముల్ నీవు లేక॥

తొలి నీరాక నిగుర్చు తత్ కిసలయస్తోమంబె హేమంతవే
ళలకున్ పండుచు పర్ణశద్యముల లీలన్ వ్రాలి, కాంచున్ సము
జ్జ్వల రాగద్యుతులన్ కిసాలయ పునర్జన్మంబు; దోబూచి యా
టలెపో! నిత్యము చేతనుల్ మలయుచుండన్ మింటికిన్ మంటికిన్॥

రోచిర్మయ మజరామర
మై చేతోమోహనము చరాచరమెల్లన్
నీ చైతన్యమె నిండెను
ప్రాచేతస వాఙ్మధూపవన నిర్భరమై॥

ఆనందప్రభవంబె భూతనివహం, బానంద సంస్థానమే,
ఆనందంబున యందె డిందు, నను నయ్యానందవల్లీ వచః
సానాథ్యంబున కెన్న నిన్ విడిచి దృష్టాంతంబు లేదెందు; స
ద్ధానన్ జైత్రమ! నీదు కీర్తులలరున్ త్రయ్యంత గేయంబులై॥

(1986)

చంద నాందోళిక

(పాపయారాధ్య భారతి - అమరావతి)

ఖద్యోతద్యుతిపుంజ పింజర వియత్ కల్పద్రు శాఖాశిఖా
సద్యోనిర్దళిత ప్రసూనజ రజస్సంఛన్న పుష్పంధయ
స్విద్యత్తాన వితాన మోహన రుతిన్ విచ్చేసితో! వేమనా
రాధ్యామ్నాయజ, వాణి, నేడు స్మృతిధారా పాపయారాధ్యయై॥

భద్రశ్రీ పరికర్మనిర్మిత మహఃపల్యంకికాసీనయై
కద్రూజాంగదు తోడబుట్టు విటురాగా; మాఱుమ్రోసెన్ దిశల్
రుద్రాణీ పరివారతాళగతులన్ రోదోంతరంబెల్ల; పు
ష్పద్రోణీకృతవర్ష, హర్షభర విద్వద్జృంభరామ్నాతమై॥

దేవీ శంభళికా ఝుళంఝుళిత పన్నీరేజ మంజీరజా
రావంబౌనా! గణాధిభూ, ఘణఘణ గ్రైవేయ ఘంటాగ్ర సం
రావంబౌనా! శిలాదనందముఖ ప్రాధ్మాత శంఖోత్థ ఘుం
ఘూవిస్ఫూర్జిత ఘోషమౌనా! మథితాంభోరాశి నిర్ఘోషమై॥

కల్యాణాచలకార్ము కాద్రితనయా కల్యాణవేళా మహః
పల్యంకీకృత వల్గుయాన వృషరాట్కల్యాణ కల్యాణియై
కల్యాణామరకావ్యలక్ష్మి, పురమేగన్ వాడలున్ వాడలున్
కల్యాణాద్రులలో! క్రౌంచభూధరములో! కైలాసశైలంబులో!॥

రింఖ త్తరంగాగ్ర కంకణయై కృష్ణ
    చిన్నారి ముత్యాల సేస లాలికె
శింజాన మంజీర శివుని పట్టపుదేవి
    మలరాచకన్నియ తలుపు తెటిచె
అమరేశ శివ కపర్దాటవీ కుటి నిక్కి
    తొలివంక జాబిల్లి తొంగిచూచె
అంతలంతల నుండి ఆరాధ్య గృహలక్ష్మి
    పుల్కుపుల్కున నేదొ పొల్చికొనియె

మల్లంపల్లి శరభయ్య

నాథసంకల్ప త్రైపురానందదత్త
చందనాందోళికాగ్ర నిషణ్ణ యగుచు
వెండి యమరావతీ పురవీథులందు
పాపయారాధ్య భారతి పరిఢవింప॥

(1988)

'ప్రొద్దు పొడిచె'

ప్రొద్దు పొడిచె నేడు పులినోటవిడివడ్డ
కండవలె తమోముఖంబు వెడలి
పుడమి బ్రదుకులెల్ల కడగండ్లు కడద్రొక్కి
వెడలుగాక! నిండు వెలుగు లలమి॥

ఇంక నైదునాళ్లకే గన్నునిప్పెద
నెఱుగ దొల్లి లోక మెట్లు నడిచె
నెఱుగ మఱియు ముంద రేరీతి నడచునో!
కన్ను మూసి నేను చన్నపిదప॥

కొన్ని చూచిచూచి– కొన్నింటి మూర్కొ –
కొన్ని సోకిసోకి – కొన్నిటి విని
కొన్ని యానియాని – ఇన్నించి దలపోయు
నెడమెలేక తాను కడచె ప్రొద్దు॥

ఇందు నన్ను వదలి ఎందేగిరో! అమ్మ
నాన్న, లన్న, లల్ల నాటి చెలులు!
తలప ధరణి బ్రదుకె దాగిలిమూతయో!
వారలెందొ! కానరారు మఱల॥

తవిలి తవిలి వారిదలపోయ దలపోయ
వత్తు రెవ్వరెవరొ! క్రొత్త చెలులు
అంతలోనె ప్రాతలై వీర లరిగిన
వత్తు రెవరొ మఱల గ్రొత్తవారు॥

తప్పి పోయిరేని తామొక్క రేనియు
నన్ను జేరరార; ఎన్నటికిని –
ఇంత దిగులు బరువు లెద మోసిమోసియు
నాట విడుపు గోరదాయె నెపుడు॥

మల్లంపల్లి శరభయ్య

ఇన్ని యుగము లేగి, యిన్ని పుటువు లేగి
ఆట యిద్ది ప్రాతయాటె యనుచు
ఎంత రూఢియైన నెప్పటి కపుడేదొ
క్రొత్త వోలె మరులు చిత్త మలము॥

ఏను క్రొత్తకాద; యీసృష్టి కిది కాదు
నాకు గ్రొత్త; యిది సనాతనంబు;
ఏ సనాతనుడ; త్రయీమూర్తి యెఱుకయై
పూర్వశిఖరి మీద పొడిచె నినుడు॥

ఉంటిదొల్లి; యిపుడు నున్నాడ; నుండెద
ముందు; నెల్ల ప్రొద్దు నుండుటె యయి;
ఇన్ని రూపు లేర్పఱించి, పేరులు నేర్ప
ఱించి యుండుమని 'శివేచ్ఛ'యగుట॥

(1989)

శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు

నిను గన్నంతన నా హృదంతరమునన్ నీలద్యుతుల్ నిండి - న
ల్లని యేరై మొయిలై మయూరమయి వల్గద్ భ్రూలతాపాంగ మో
హన విద్యుత్ సుషమా నిరస్త కుహకంబై గీత మేనాటిదో
నినదింపన్ - కతమేమి? లక్ష్మణయతీ! నిర్వ్యాజహార్దాకృతీ!!

నీ యెదలో నాడెడుతరి
నా యెద నొక్కదుగునిడ, క్వణత్ కింకిణితో
మీ యదుపతితో జెప్పుమ
యా! యతికుల చంద్రమా! దయాసాంద్రరమా!!

(1990)

చతుష్షష్టి

యష్టి ఆలంబమై తనుయష్టి ఇట్టు
లనుపదంబును పతయాళువయ్యు గూడ
నాకు నొక్కింత నీగాలి సోక, ఒడలు
జలదరించు నదేమొ, ఆషాఢ జలద!

మిన్ను మన్నేకమై క్రమ్ముకొన్న మొయల!
కన్నువిప్పిన తొలినాడు, కన్నుమూయ
నున్న యీ తుది నేడును ఒక్కరీతి
క్రిక్కిరిసి యుంటివీ బ్రదుకెల్ల నీవె.

నీ వచో భావనానేహ నిబిడలీన
శైశవాది వయోదశా – జాగ్రదాది
సకల వృత్తి నభశ్చతుష్షష్టి తిరిగి
చేతనా మాత్రముగ మిగిల్చినది నన్ను.

(2003)

శ్రీ వేణుగోపాల శతకము

(1981)

ప్రత్యభిజ్ఞ

నరజన్మంబిటు సార్థమై నెగడె కృష్ణా! ఎక్కిరాలాన్వయ
స్ఫురితేందుచ్ఛలమూని తేరుగడయై బోధామృత స్యందముల్
కురియన్ సర్వమునన్ భవన్మయత నాకున్ బ్రత్యభిజ్ఞాతమై
చిరభవ్యం బనపాయ మవ్యయముగా శ్రీ వేణుగోపాలకా!

ఆశంసనము

భక్తిభావ మనబడు దహరాకాశరంగమున శివ కేశవ పాత్రలు ఒకే కథానాయకుని రెండువిధములైన ఆహార్యములు. ఈ నాయకుని నాటకీయములైన లీలలలో శైవ వైష్ణ వాగమములయుత్పత్తి పతాకస్థానము నలంకరించును. అందు జీవుల పూర్వపుణ్య సంస్కారములు పంచసంధులతో శైవులను, వైష్ణవులను కార్యావస్థలకొరకు పుట్టించును. జగన్నాటకరంగము పండిత నాటకరంగమువలె నవరసములతో పరిమితము కాదు - 'అనంతావైరసాః... రసోవై సః'! ఎందరు జీవులు పాత్రధారణ చేసి, ప్రవేశ నిష్క్రమణములు చేయుచున్నారో - అన్ని రసములుత్పన్నమగుచున్నవి. స్థాయిభావము మాత్రము అంగిరసమునకే సిద్ధించును. అదియే శివకేశవుల ఆహార్యముతో ప్రసన్నమగుచున్న అంతర్యామి అనుభూతి.

ఈ అంతర్యామి లీలలలో పూర్వ పుణ్య సంస్కారమున శైవులు, వైష్ణవులు పుట్టుచున్నారు. (ఈ భేదము బొట్టునుబట్టిగాని, సాంగత్యమునుబట్టిగాని వచ్చినది కాదు - జీవధర్మము రూపమున దిగివచ్చినది.) అట్టివారిలో నిజమైన శైవులు తమ జీవిత నాటక గర్భసంధిలో వైష్ణవులుగా మారుచున్నారు. వైష్ణవులు శైవులుగా మారుచున్నారు. అట్టివారిలో శివశ్రీ మల్లంపల్లి శరభయ్య యొకరు, నేనొకడను. ఇంకను కొందరుందురు. దీనిని గూర్చి సందేహపడువారిలో మాత్రము ఈ యనుగ్రహలీలకు పాత్రులగువారుండరు.

శ్రీ వేణుగోపాల శతకము శైవకవి రచించిన వైష్ణవ శతకము, సజాతీయములు, విజాతీయములు అగు భావములచే తిరస్కృతముకాని శివ విష్ణు పరబ్రహ్మము ఇందలి వేణుగోపాలుడు. ఈ గోపాలుని 'కెంజెదవిపైన కజ్జలాంకములు, గళముపై కంకణాంకములు, ఉరమున శ్యామా పదాంకములు, చెక్కిలిపై నఖాంకములు' దర్శించినపుడే కవి "శివ శివ!" యనకుండ నుండలేకపోయినాడు! పూర్వము ఆంధ్రవాఙ్మయమున నిట్టి కవి యొకడున్నాడు. అతడే ఆచార్యపురుషుడనదగు తెనాలి రామకృష్ణకవి. అతడు శివుని కీర్తించుచు, 'వైష్ణవ సార్వభౌముడు' అని, కైలాసమున ప్రమథగణముల నడుమ కూర్చుండిన శివునకు పంగనామములు దిద్దగలిగినాడు! ఆ వైష్ణవ సార్వభౌమునకును, ఈ శైవ వేణుగోపాలునకును భేదము కనుపింపదు. ఇట్టి రచనలు మోక్షరససిద్ధులైన సహృదయుల పూర్వపుణ్యపు పంటలై పండును. ఈ పంటను అందరు ననుభవింపలేరు. అనుభవించినవారు మాత్రము మరియొక రుచికి వ్యామోహపడరు.

"మందార మకరంద మాధుర్యమున తేలు
మధుపంబు వోవునే మదనములకు!"

ఉత్తమ కవులకు జీవితమొక సారస్వత సత్త్రయాగము. వారు చదువుకొన్న కావ్యముల కర్తలు వారి అంతరంగమును సత్త్రశాలలో ఆజన్మాంతము సన్నిధిచేసి యుందురు. శరభయ్యశర్మలోగల లోగిలి బహుసహస్ర మహాకవులకు సత్త్రశాల. అంతేకాదు, ఆ కవులందరు అవకాశము కలిగినపుడెల్ల అతని జిహ్వాగ్రమున నిలిచి కూనిరాగములు తీయుచుందురు. ఇతనికి పుస్తకాపేక్ష లేదు. కనుకనే అఖండ రససిద్ధి గల ఈ శతకమును ఆస్వాదించువారికి లీలాశుకుడు, జయదేవుడు, పోతన, తెనాలి రామకృష్ణుడు, విశ్వనాథ సత్యనారాయణ చవులుగా తగులుచుందురు. "శిత పింఛేంద్ర ధనుస్సమంచిత" అను పద్యమున పదబంధమునుండి, సమాస ఘటననుండి, సంబోధనల వైఖరులవరకు రామకృష్ణుడు, విశ్వనాథ కలిసి సల్లాపము చేయుచున్నట్లున్నది. "మౌళిస్ఫార మయూర బర్హభరమై" అను పద్యమున జయదేవుని వీణమీటులు, పద్మావతీ చరణ చారణము, లీలాశుకుని అమృతపు చినుకులు సభ చేయుచున్నవి. "మాపాలన్ కృప యింతయుం చెరుగవే", "నిను రమ్మన్నది యెవ్వరోయి యిచటన్?" అను పద్యములలో పోతన మహాకవి ముచ్చటించుచున్నాడు. "భరితైనః పటలీ మహాంధ్య భరితంబై" అను పద్యమున ధూర్జటి మహాకవి వీరశైవ ముద్రయున్నది. ఇది యనుకరణ కాదు. రససిద్ధుడగు సాహిత్య సూదకుని వంటకమున వివిధ శాకపాకము లున్నను. అతడు లోకమున కందించు చవులు మాత్రము అనన్యములై యుండును. అనుకరణ కవుల రచనాపాకమున కూరముక్కలుడుకవు. కక్కుర్తి పడినపుడు ఈ యుడుకనితనము శ్రీనాథునకే తప్పలేదు. ప్రాచీన మహాకవుల రుచులను జీర్ణించుకొనగల కవుల రచనలలో కనిపించునది ఆ పూర్వకవుల సంస్కారమేగాని, అనుకరణము కాదు. పూర్వజన్మ సంస్కారములకును, ఎరవుతెచ్చుకొన్న భావములకును గల భేదమే యిట్లుండును.

ఈ కవికి జీవితము, సాహిత్య జీవితము వేరుకావు. ఇతడొక రసోన్మత్తుడు. ఒక పదివేల సంవత్సరములు ఏకాంతముగా నుండుమన్నను పూర్వకవులతో నిరంతర సల్లాపములు చేయుచుండగలడు. పూర్వజన్మలలో చేసినను చేసియుండవచ్చును. అప్పటి మాధుర్య స్రవంతి యిప్పటి జీవిత ఘట్టములచే అతిరస్కృతమూర్తిమంతము. లేనిచో భౌతిక జీవితఘట్టముల ప్రభావమున నితడు పిచ్చివాడై యుండవలసినది. ఇది కూడ ఇతని సాహిత్యోన్మత్తతకు కారణమేమో! ఒకమాట మాత్రము నిజము - ఇతని ఐహిక జీవితము నితడు జీవించుటలేదు. అంతర్వాహియైన యితని సరస్వతియే యీ వేణుగోపాల శతకముగా ప్రవహించి, సహృదయులకు తరంగ మృదంగ నాదములను వినపింపచేయుచున్నది. లోచూపు కలవారు దీనిని 'లో నారసి మే' లనుడు! వెలి చూపు కల ఇతరులు 'అక్షర రమ్యత నాదరింపుడు!' ఎల్లరును మధురాధిపతి యనుభూతిలో తరింపు చెందుదురు గాక! ఇతని జిహ్వాగ్రమును తన వేణునాళముగా స్వీకరించి, యాదరించి, వేణుగోపాలుడు చిరకాలము కావ్యశ్రుతులు తేలియాడు రసానుభూతిని తన యమునగా కల్పించి విహరించును గాక!

విశాఖపట్టణము — ఇట్లు

16-12-1981 — ఎక్కిరాల కృష్ణమాచార్య

నివేదనము

"శివస్య హృదయం విష్ణుః! విష్ణోశ్చ హృదయం శివః!"

ఈ మంత్రానికి మా నాయనగారే నిదర్శనము! మాది శైవ సంప్రదాయం! వీరశైవులము కాకపోయినా మాకు వైష్ణవ ద్వేషం లేదు! భస్మరేఖాలాంఛనములు, రుద్రాక్షమాలలు ధరించినప్పుడు మా నాయనగారిని చూచినవారెవరైనా పరమశివుణ్ణి స్మరిస్తారు.

కానీ చెప్పాలంటే ఆయన సహజంగా వైష్ణవులు! వారి ఫాలభాగాన వైష్ణవ లాంఛనములై మూడు నరాలు నిలువుగా స్ఫుటంగా కనిపిస్తాయి! ఇది వారి జన్మరహస్యం. వీరికి శివకేశవులు ఇరువురూ ఆత్మ సన్నిహితులు. అంతేకాక వారిరువురినీ ఏకదృష్టితో చూడగల్గిన మహామహిమాన్వితులు. దానికి నిదర్శనమే ఈ వేణుగోపాల ప్రతిష్ఠ! శతకరచన!

"ఎన్నటిదియో! పద్యంబె నా సంస్మృతిన్ జెలగన్ బోలును నీవ సంస్ఫురణవై శ్రీ వేణుగోపాలకా!" అంటూ మా నాయనగారు స్వామివారియందు ఈ శతకం ఆవిష్కరించారు.

శతకము పూర్తి అయినట్లు తెలియగానే పూజ్యసోదరులు శ్రీ పార్వతీకుమార్‌గారు నాన్నగారితో, W.T.T. ఇది తరఫున అచ్చు కాబోవుతున్నది. ఇది మాష్టరుగారి సంకల్పము! మీకు వెంటనే 'ప్రెస్ కాపీ' పంపవలసినదని ముఖతః చెప్పినారు. వారు మాస్టరుగారితో విదేశములు వెళ్ళుతూ కూడ మరల నాన్నగారు నన్ను 'ప్రెస్ కాపీ' తీయమనటం వల్ల నేను ఇలా వ్రాయటం సంభవించింది.

ఒక్కొక్క పద్యం వ్రాస్తూ ఉంటే - ఆ రుక్మిణీ సత్యభామలు, ఆ రాధ, ఆ గోపికలు మొదలగు ఆ పరమభాగవతులందరూ నా హృదయమంతా నిండి ఉన్నారు.

నాకు ఏ భావం కలిగినా వెంటనే కాగితంమీద పెట్టటం అలవాటు! అలాగే ఏదో వ్రాశాను. నాన్నగారు ఇదిచూసి నన్ను వెంటనే 'ప్రెస్ కాపీ' తీసి పంపమని ఆదేశించారు.

నాకు చాల సంకోచంగానే ఉంది! అసలు నాన్నగారు వేణుగోపాల శతకం ఎందుకు వ్రాశారో, ఎలా వ్రాశారో, ఎలా ప్రతిష్ఠించారో అన్న విషయం చాల చిత్రమైనది! కనుక మళ్ళీ ఏమీ సంకోచించకుండా ఇదంతా పరమగురువుల అనుగ్రహమేనని భావించి యిది వ్రాస్తున్నాను. లేకపోతే వారి శతకంమీద నేను విమర్శ వ్రాయటమేమిటి?

ఇదీ ఆ భగవానుని లీలే అని తోస్తున్నది నాకు.

ఎన్నడో మూడువందల సంవత్సరాల నాటి కథ ఇది -

"మద"కున్ దేవర రాక చిత్రము త్రియామామధ్యయామంబు స
వ్వడి లే కాంధ్ర మొరంగి నిల్చితి విటన్ వంశీసహాయుండవై
ఎడబాటగ్గికి నెంత గ్రుగ్గిరొకదా యిల్లాండ్రు! మైనుండి: యె
య్యెడలన్ గుండెలుతీయు బంటువన నీవే! వేణుగోపాలకా !

ఈ స్వామివారి అసలు స్వరూపం ఈ పద్యంలో బయట పడుతోంది! ఇది చాల విచిత్రమైన కథ!

కృష్ణాజిల్లా దివిసీమ మొవ్వ వేణుగోపాలస్వామికి సమీపంలో వేములమడ అనే పల్లె ఉంది. కృష్ణ ఆవలి ఒడ్డున జంపన అనే గ్రామంలో శ్రీరుక్మిణీ సత్యభామా సమేతులై వేణుగోపాలస్వామివారు ఉండేవారు. ఈ వేములమడ చల్లపల్లి సంస్థానంలోనిది.

ఒకరోజున వేములమడలో నడివేసవి మండుటెండలో ఆ ఊరి పెత్తందారుని ఇంటికి ఒక సన్యాసి వచ్చి దాహమడిగాడు. ఆ గృహిణి దాహం పంపగా ఆ సన్యాసి ఈ మూడు ప్రశ్నలు వేశాడు.

"మీ ఊరిలో గుడి ఉన్నదా? బ్రాహ్మణులున్నారా? మంచినీటి చెరువు ఉన్నదా?" అని అడిగి, ఇవి ఏవీ లేవని తెలుసుకుని, అడిగిన దాహం తీసుకొనకయే వెళ్ళిపోయాడు.

ఆ గృహిణి చాల నిర్విణ్ణురాలై గ్రామాంతం వెళ్ళి వచ్చిన భర్తతో జరిగిన వృత్తాంతం చెప్పింది. అతనికి ఎలా అయినా గుడి కట్టించి తీరవలయుననే ఉన్నది. కానీ, గుడి కట్టించటం సామాన్యమా? అని ఆలోచనాపరుడై తన ఆప్తమిత్రుడు జంపన పెత్తందారునితో జరిగినదంతా చెప్పాడు.

దానికి ఆ మిత్రుడు "గుడి కట్టించటం పెద్దసమస్య కాదు. నీవు వెంటనే ఆలయం నిర్మించు – మా ఊరిలో కావలసినన్ని దేవాలయములున్నాయి. వాటిలో ఏదో ఒక విగ్రహాన్ని ఇస్తాను!" అని వాగ్దానం చేసి, ఈ రహస్యం మన ఇరువురికీ తప్ప ఇతరులకు (ప్రభువులకు) తెలియకూడదని వ్యవహారం నడిపాడు.

త్వరలోనే ఆలయం పని పూర్తి అయింది.

"దొంగలూ, దొంగలూ కలసి ఊళ్ళు పంచుకున్నా"రన్నట్టు, ఇద్దరు పెత్తందారులూ కూడపలుక్కొని ఒకనాటి అర్ధరాత్రివేళ జంపన గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేతుడైన వేణుగోపాలస్వామిని పెళ్ళగించటానికి సంసిద్ధులయ్యారు.

విగ్రహములు మూడూ ఒకే పీఠమునందు ఉన్నప్పటికీ, వేణుగోపాలస్వామిని మాత్రమే వారు పెళ్ళగించగలిగారు. ఆ విగ్రహాన్ని బండిలో వేసి, గడ్డితో కప్పి శ్రీకాకుళం ప్రాంతం వరకు ప్రయాణం సాగించారు. అప్పటికి తూర్పురేఖలుదయించటం వలన, కృష్ణానదిలో యిసుకలో దాచిపెట్టారు.

జంపన గ్రామస్థులు తెల్లవారి ఆలయములో స్వామి లేకపోవటం చూచి దిగ్భ్రాంతులయ్యారు. పిమ్మట కొంతకాలమునకు కృష్ణలో దాచిన విగ్రహాన్ని వెలికి తీసి వేములమడ గ్రామస్థులు తాము కట్టించిన ఆలయంలో ప్రతిష్ఠించారు.

అక్కడ జంపనలో రుక్మిణీ సత్యభామలను - స్వామి లేకపోవటం వలన - ఎవ్వరూ పట్టించుకొనలేదు. వారు ధూపదీప నైవేద్యములు లేక, స్వామి విరహమును అనుభవిస్తున్నారు.

'బ్రాహ్మణుం, దగ్నిద్యోతను డేటికిం దడసెనో యత్నంబు సిద్ధించునో'

అని రుక్మిణీదేవి తన వివాహానికి ముందు ఆ స్వామిని ఎంత ఆరాధించినదో, ఆ స్వామిని పొందటానికి ఎంత ఆరాటపడిందో, ఆమె భక్తి విరహాన్నంతటినీ పోతనగారు భాగవతంలో ఆ కల్యాణ సందర్భంలో వివరించి ఉన్నారు.

ఆ స్వామియందుండే భక్తిచేత బ్రాహ్మణునిద్వారా సందేశం పంపి తాత్కాలికంగా తన ప్రయత్నంచేత స్వామిని పొందగలిగిందే కాని, రుక్మిణీదేవి స్వామి యొక్క దివ్యత్వాన్ని మాత్రం ఈ పునర్విరహంలోనే తెలిసికొని,

"యే లీలలజొచ్చి పట్టనగునోయీ! వేణుగోపాలకా!"

స్వామీ! నిన్ను వెదికి పట్టుకోవాలనే ప్రయత్నం వ్యర్థం! అని సిగ్గుపడి-

వెదుకన్ నిన్ వెలి నెన్ని జన్మములకున్ వేసారుటే; ప్రొద్దు చా
లదు లోజీకటులన్ దమాల తరుజాల చ్ఛాయలన్ నీల నీ
రద కాంతిచ్ఛటలన్ బ్రభిన్నశిఖి బర్హచ్ఛన్నమై లోగు రూ
పిది! యే లీలల జొచ్చి పట్టనగు నోయీ! వేణుగోపాలకా!

అని- ఆమె స్వామియందు స్థితప్రజ్ఞత్వాన్ని పొందుతున్నట్టు కవి హృదయం వల్ల తెలుస్తున్నది.

ఇక సత్యభామ సంగతి-

సత్యభామ గర్విష్ఠి, కోపిష్ఠి అని లోకం అంటుందే కాని, స్వామియందు అవి ఆమెకు సహజమైన ఆభరణాలు!

స్వామియందుండే అనురక్తికి తెలియజేయటానికే అవి ఆమెకు చాల ఉపయోగిస్తాయి తప్ప, అవే ఆమె నిజస్వరూపం కాదు!

నిన్నున్ మించి జగద్గురుత్వ పదవిన్ నిర్వాణ తత్త్వార్థ సం
పన్నా కారము మూడు కాలములలో భావింపగారాదు; పై
నెన్నన్ నిన్నును మించి వేరొకయెడన్ శృంగార లీలా మహ
స్సన్నా కారమునైన కానముగదా! శ్రీ వేణుగోపాలకా! 52

అని సత్యభామ స్వామిని తలంచుకొని గర్వపడుతుంది!

మరియొక చోట-

తలతున్ నీ వని రాకయే చరమసంధ్యా వేళలన్ గోఖు రా
చల చంచత్పదవీ రజః పటల సంఛన్నాల కాబ్దాంత పే
శల చంద్రోదయవ ద్విభాసి లలితాస్యస్యూత గోపీవ్ర గం
చల నీలోత్పల సించితామృత కటాక్షా! వేణుగోపాలకా!

నాకు తెలుసులే నీ సంగతి! అసలు నేను గుర్తుంటేగా!

ఆ అడవిలో ఉండే ఆ గోపిక నీకు మక్కువ! నీకు నేను ఆ గోపికల సాటి కూడా చెయ్యలేదన్న మాట! అని రోషపడుతుంది!

కానీ ఆమె నిజస్వరూపం ఏమిటో ఇక్కడ తెలుస్తుంది.

ఘలు ఘల్ ఘల్లున కింకిణీ కిణికిణుల్ కాళీయ భాస్వత్ ఫణా
తల రత్న స్థలులందు గ్రేళ్ళురికి నృత్తంబాడు నెత్తమ్ము లా
లలితాంఘ్రిద్వయిక్రింద నేర్పరుతు నుల్లం బల్లనన్ మెత్తనౌ
జిలుగుల్ జిల్గులుగాగ నొత్తనిక్రియన్ శ్రీ వేణుగోపాలకా !

స్వామి ఇతరులవలన కష్టపడుట తానేమాత్రమూ సహించదు! ఆనాటి నరకాసురవధలో స్వామికి ఎట్లా సహాయపడిందో, ఇక్కడ కాళీయుని మర్దిస్తుంటే స్వామివారి పాదాలు ఎక్కడ కందిపోతాయోనని తన మనస్సును ఆ ఫణిరత్నాలమీద పరుస్తుంది!

ఇదీ ఆమెలోనున్న సౌమనస్యం!

ఇక రాధ!

రాధాదేవి హృదయమంతా కృష్ణుడే నిండి ఉంటాడు. కృష్ణుని యందు ఆమెకు కల్గిన ప్రేమ పరమ ప్రేమ! ఆ కృష్ణుని వేణు నాదానికే ఆమె ఎంత పారవశ్యం చెందుతుందో-

నీ వంశీధ్వని వాహినుల్ వరదలై నిండార బ్రహ్మాండముల్
ద్యో వీథిన్ గ్రహతారకాగణము చిందున్ బిందులై బిందులై
జీవాంతర్ హృదయాంబరంబు నినదించెన్ స్పందమై మంద్రమై
నీ వేణుధ్వని స్థూల సూక్ష్మములు నిండెన్ వేణుగోపాలకా!

ఆమె భక్తిపారవశ్యానికి స్వామియే 'రాధాకృష్ణ'డైనాడు!

ఇంక ఒక్కొక్క గోపిక మనస్థితి ఒక్కొక్క విధంగా ఉంటుంది. గోపికలు మాత్రం సామాన్యులా! వారు నిరంతరము ఆ స్వామిని ధ్యానిస్తూ ఆ వేణునాదాన్ని ఆస్వాదిస్తూ ఎప్పుడూ తమ మధ్య కృష్ణుడు ఉన్నట్టే భావిస్తారు. ఒక గోపిక ఇలా తలపోస్తుంది:

ఒప్పుల్ కుప్పలు వోసిన ట్లలరు నీ యొయ్యారమే యెంతునో!
చిప్పం గూకట నెమ్మికంటి హరువౌ సింగార మూహింతునో!
కప్పున్ దిక్కులదావి నెన్నొసటిపై కస్తూరి ధ్యానింతునో!
చెప్పంగిప్పగరావు నీ హొయలు లో శ్రీ వేణుగోపాలకా!

అని – స్వామివారి సౌందర్యాన్ని – ఒకదానికన్నా ఒకటి విశేషంగా భావిస్తూ, ఆ గోపిక ముగ్ధమోహనతను చెందుతూ ఇంకా ఇలా అంటుంది–

నీ యొయ్యారమె నిండె లో యెదదలో నిర్వ్యూహ బర్హంబుగా
ప్రేయోహాసము గాగ పార్శ్వవలిత గ్రీవా విలాసంబుగా
తోయేజాభ విలోచనమ్ములుగ కస్తూరీ నిటాలంబుగా
మై యెల్లన్ తొలికారు క్రొమ్మొయిలు మంపై వేణుగోపాలకా!

ఇంక ఆ వ్రేపల్లెలో ఒక గోపిక స్వామి వేణునాదాన్ని వినీ వినినంతనే–

మృదులాలోల కరాంగుళీ దళిత వంశీరంధ్ర గర్భంబులన్
పొదలన్ మిన్నుల బూరటిల్లగ రసాంభోరాశి; యేనాటిపో
హృదయ గ్రంథులు వ్రీల వ్రాలి రజలల్ వ్రేపల్లె పై యెల్లలన్
ప్రిదులు నీవులు జారు క్రొమ్ముడులునై శ్రీ వేణుగోపాలకా!

ఈ లౌకికమైన స్ఫురణ మరచి ఆమె కేశములు విడివడినను ముడివేయక ఆ నాదాన్ని వింటూ ఆ దెసనే అనుసరిస్తుంది.

మరియొక గోపిక:

స్మయ దబ్జాక్ష! ఘటింపవే! యెపుడు నా స్వాంతంబునన్ నీదు ప
ల్లియయో! నల్లనియేరౌ! పచ్చబయలో! లేదూదలో! జారువ
ల్లియయో! పిల్లనగ్రోవియో! నెనరులో! లేజూపులో! నెమ్మిపిం
చియమో! వంచిన యొరమోము సవురో! శ్రీ వేణుగోపాలకా!

మరియొక గోపిక స్వామి తన దగ్గరకు ఆలస్యముగా వచ్చినందుకు ఖండితమై ఇలా పరిహసిస్తుంది:

నవనీతప్రియ! నీదు కెంబెదవి పైనన్ గజ్జలాంకంబులే?
లవలీ పల్లవగల్ల! మీ గళ మదెల్లన్ గంకణాంకంబులే?
సవురౌ మీయుర మెల్లెదన్ – శివ శివ! శ్యామా పదాంకంబులే?
చివురుం జెక్కిలిపై నఖాంకములెపో! శ్రీ వేణుగోపాలకా!

"శివ శివ శ్యామాపదాంకంబులే" అన్న చమత్కృతి ఒక్క గోపికదే కాదు; మా నాన్నగారిది కూడా!

నిను నోలార్పగ పాల, గోవయిన కానేకాకపోతిన్‌గదా !
నిను కన్నారగా జూడ నే నెమలినేనిన్ గాకపోతిన్‌గదా !
నను వంచింపనె కాదె యిట్టి నరజన్మం బిచ్చి తీవంచు దూ
రిన నా డెందమె నొవ్వ నెవ్వగ గదా ! శ్రీ వేణుగోపాలకా !

"కృష్ణా! నను వంచించావయ్యా! నా కీ జన్మనిచ్చి! అయినా ఏ గోవునో, ఏ గోపికనో, మరి ఏ పింఛమునో కాకుండ నాకీ నరజన్మ రావటమూ – ఇదీ ఒక అదృష్టమేలే! ఆ పరమభాగవతుల ఆ ఆనందానుభూతులన్నీ తలంచుకోవటంలో మరి ఎంత ఆనందమో! ఇది అంతా నీ లీలే లేవయ్యా స్వామీ!"

అర్జునుడు కూడా ఇలా అంటాడు:

హే కృష్ణా! నన్ను తోలేదీ నీవే! నా అశ్వాలను తోలేదీ నీవే!

వెనుకం దోలిన ముందు తోలినను నీవే! మత్తనూ స్యందనం
బున బోధామృత హర్ష వర్షముల నంభోదంబవై క్రమ్మి పా
రణ సేయింపగ దేరుచున్నవి మనః ప్రాణంబు లల్లంత తే
రిన పై జూలు విదల్చు వాజుల ససిన్ శ్రీ వేణుగోపాలకా!

ఇక ఆ గజరాజు ఇలా ఆక్రోశిస్తున్నాడు:

నీ కారుణ్యమునందె మేలుకొనగా నీయందె కన్మూయగా
నా కీ లోక ఋణానుబంధ మిది యెన్నా ళ్ళెన్నినాళ్ళో ప్రభూ!
ఓ కారుణ్యపయోనిధీ! మనుపవే! యో దీనచింతామణీ!
చీకుంజింతల జిక్కి స్రుక్కనిగతిన్ శ్రీ వేణుగోపాలకా!

ఓ కారుణ్య పయోనిధి! మనుపవే! ఓ దిన చింతామణీ! ఈ లోక ఋణానుబంధములో చీకుచింతలు అనే మొసళ్ళ నోటి నుండి నను రక్షించవయ్యా స్వామీ!

సదయా! యింద్రియ ధేనువుల్ విషయ ఘాస గ్రాసలోలమ్ములై
బ్రదుకుం బీడుల బట్టి నిన్ మరచి పోవంబోవ; బ్రాయంపు బ్రొ
ద్దదె! డిందన్ బయి గ్రమ్ము చీకటులలో నల్లాడవే? సుంత, నీ
మృదువౌ మోవిని పిల్లగ్రోవి నిడవేనీ! వేణుగోపాలకా!

ఇక్కడ ఈ పద్యంలో కృష్ణుడు – గోవులు!

"ఇంద్రియ ధేనువుల్ విషయ ఘాస గ్రాసలోలమ్ములై" అనగానే ఆధ్యాత్మికమైన తాపం అంతా నిగూఢంగా ఆ పద్యంలో దాగి ఉంది!

"సర్వాంతర్యామివై యున్న నీవు; ప్రకృతికి అతీతుడవై జీవులను నీ మాయలో ముంచెత్తుతున్న నీ క్రీడావైభవమును చూసే భాగ్యము నాకు కల్గించు" అనీ–

సకలప్రాణి హృదంతరస్థితుడవై సర్వక్రియాసాక్షివై
ప్రకటీభూత గుణాత్మమాయ నిటు సర్వా నేహమున్ ద్వంద్వ మో
హక భావంబు ఘటించి జీవులను సయ్యాటించు నీ నేర్పు లెం
చి కదా నిన్ను దలంచి సొమ్మసిలుటల్! శ్రీ వేణుగోపాలకా!

"వాసాంసి జీర్ణాని యథా విహాయ" అన్నట్టు-

పారంబందని యెన్ని పుట్టువులకున్, భావింప నిస్సార సం
సారంబందున సార మీ వొకడవే; సంవిన్మయాకార! సం
సారం బంతయు సారమై చను భవజ్జన్మక్రియాతత్త్వ వి
స్మేరాంతఃకరణారవిందులయినన్ శ్రీ వేణుగోపాలకా!

"చ్యుతమై యుత్తర వాయువీచి హతులన్ జొక్కాకులై రాల; సంచిత మాగామియునైన కర్మతతి; వీచీ దక్షిణాశానిలాహతులన్-"

మతి నే యత్నము లేదహో ! సహజమౌ మాంద్యంబె బోధంబుగా
సత మీ జీవిత మిట్లు సాగెదు యదృచ్ఛా ప్రాప్త భోగంబె, యా
యతి, నీ యైహిక మెట్టులైనను-ప్రభూ ! అముష్మికంబందు వం
చిత మైనన్ దెరు వెట్టు లంచితదయా ! శ్రీ వేణుగోపాలకా !

"అరుదై యే క్షణ మెట్టులో యెరుగకే యా బ్రహ్మకల్పంబుగా
.................భవదీయ లీల నడవన్ శ్రీవేణుగోపాలకా!"

మొదలగు పద్యాలన్నీ ఆధ్యాత్మికములై భగవద్గీతోపనిషత్తుల సారాంశాన్ని వ్యక్తపరుస్తున్నాయి!

కొన్ని పద్యాల్లో స్వామి శృంగార రస సంపూర్ణుడుగా ఉంటే, మరికొన్ని పద్యాలు భాగవతులయొక్క భక్తిపరత్వాన్ని వ్యక్తపరుస్తున్నాయి!

ఇంకా ఆ దశావతార వర్ణన అవీ చూస్తే ఆ మహావిష్ణువు యొక్క విశ్వరూప వైభవమే భాసిస్తుంది!

శతకమంతా భాగవత భగవద్గీతలలో నిండిన శ్రీకృష్ణతత్త్వాన్ని గోచరింపజేస్తున్నది.

సకలాజాండ కరండ గర్భకుహళీ సంపూర్ణ నాద ప్రవ
ర్తక భావం బఖిలాగమాంత పరిపూర్ణ ఖ్యాతియున్, మౌళి చం
ద్రకమున్ గోపరిపాలనైకరతి కాంతారాంత సంచార మెం
చికొనన్ వంచన లేదహో! శివుడవే! శ్రీ వేణుగోపాలకా!

ఇచ్చట - శివకేశవులకు భేదభావము లేదని శివతత్త్వంతో నిండిన కృష్ణతత్త్వం కవి హృదయాంతరంలోనుండి సువ్యక్తమైనది!

“శివసంకల్పముగాగ నిన్నిట బ్రతిష్ఠింపించె నాచేత; శా
స్త్రవిధిన్ సాధు మనోభిరాముడు తుకారాముండె....”

జటియై స్థండిల శాయియై తపమురాశై యేకభుక్తాశియై
వటువై నీ చిర విప్రయోగ కలనన్ బ్రహ్మప్రయత్నంబునన్
ఘటియించెన్ నిను నాంద్రతోడ: గుడియున్ గట్టించె నీ కిందు, నె
చ్చటనున్ గల్గునె ! యిట్టి శీలములు ! కృష్ణా ! వేణుగోపాలకా !

ఇంత తపోనిష్ఠుడైన తుకారాముడు ఆనాటి భద్రాచల రామదాసునిగా దీక్షగా ఇప్పుడు కూడ తన కార్యము నెరవేర్చెనని నాకు తోస్తున్నది.

నిజమైన భక్తుణ్ణి భగవంతుడు ఎప్పుడూ పరీక్షిస్తుంటాడు! అప్పటికి కాని భక్తునికి భగవంతునియందు పరిపూర్ణ విశ్వాసం కుదరదు! ఏనాడయితే పరిపూర్ణ విశ్వాసం కల్గి సర్వసంగ పరిత్యాగం చేస్తూ ఏ భక్తుడైతే ముందుకు వస్తాడో, భగవంతుడు వాడిని తన పరిపూర్ణ కటాక్షంతో తప్పక అనుగ్రహిస్తాడు!

“వెన్నెల్ ముచ్చిలు నేర మేమగునయా! వ్రేపల్లె యిల్లిల్లునన్
నిన్నే ముచ్చిలినారు వేములమడన్! నీ కన్ననున్ గన్నగాంద్రు”

అప్పటి గ్రామస్థులు ఈవిధంగా స్వామిని దొంగిలించి ప్రతిష్ఠించారు. అప్పటినుండి ఆ గ్రామస్థులకు చాల అరిష్టములు సంభవిస్తూ వచ్చినాయి. ఈ కథ ఆ ఊరివారందరికీ తెలిసినదే అయినా, ఎవరూ పట్టించుకోలేదు! అప్పుడు ఈ తుకారాముడు నిష్ఠాగరిష్ఠుడై కార్యదీక్షకై పూనుకొన్నాడు. ఇతడు మరల స్వామికి గుడి కట్టింపనెంచినాడు. ఈ తుకారాముని సత్ సంకల్పానికి మెచ్చి ఒక సన్యాసి మంత్రోపదేశం చేసి వెడలిపోయాడు.

ఇరువురు రాజస్త్రీలు దీనవదనలై కన్నీరు కార్చుచున్నట్లు ఇతనికి స్వప్నం వచ్చింది. రుక్మిణీ సత్యభామలను కనుగొనటం అసాధ్యమైనప్పటికీ, తుకారాముడు తన భక్తి నిష్ఠలతో కనుగొన్నాడు. తన స్వప్నంలో కాంచిన ఇరువురు రాజస్త్రీలే – ఈ రుక్మిణీ సత్యభామలు.

జంపన గ్రామంలో ఊరు చివర శిథిలమైన దేవాలయంలో ఈ రుక్మిణీ సత్యభామలు– స్వామి లేనందున వారి ఆలన పాలన ఎవ్వరూ పట్టించుకోనందున – అలా ఉన్నారు.

తుకారాముడు ఈ అమ్మవార్లు కనబడినందున మహానందభరితుడై వారిని వేములమడకు తీసుకొని వచ్చుటకు యత్నింపగా ఊరి ప్రజలు అడ్డుకొన్నారు.

అప్పుడు తుకారాముడు వారితో–

“అమ్మవార్లనూ, స్వామివారినీ వేరుచేయటం చాలా అపరాధం. ఇప్పటికే మన పూర్వులవలన మహాపచారం జరిగింది. మీరు వెంటనే ఆలయం కట్టించి మా స్వామివారిని

తెచ్చి అమ్మవార్ల సహితంగా ప్రతిష్ఠించుకొంటే సరే - లేదా అమ్మవార్లను మాకిస్తే మా ఊరిలో గుడి కట్టించుకొంటాము."

అనగా వారు కొంతకాలం గడువడిగారు. గడువు తీరిపోయింది గాని, ఆలయ నిర్మాణ ఛాయలే గమనికకు రాలేదు!

తుకారాముడు దేశంలోని ఊరూరులా వాడవాడలా తిరిగి చందాలు ప్రోగుచేసి వేములమడలో ఆలయ నిర్మాణం కావించాడు.

పిమ్మట తుకారాముడు కొంత పరివారంతో జంపన గ్రామం వెళ్ళి వారిని ఒప్పించి అమ్మవార్లను భగీరథ ప్రయత్నంతో వేములమడకు తరలించాడు.

"రుక్మిణీ సత్యభామలు మా ఊరి ఆడుపిడ్డలు" అని, జంపన గ్రామస్థులు తుకారాముని, పరివారమును, భోజనములు చేసి వెళ్ళవలెనని నిర్బంధించగా, వేములమడ గ్రామస్థులందరూ అంగీకరించారు.

శ్రీ తుకారాము దీక్షాపరులైన ఋత్విక్కులతో జపహోమాదులు చేయించి ఒక ఐదు రోజులు ప్రతిష్ఠా మహాక్రతువును నిర్వహింపజేశాడు.

చరితార్థత్వము నొందె పుట్టువు ప్రతిష్ఠాదివ్యయజ్ఞంబునన్
ధరణీసూక్తము మున్నుగా విహిత తత్తత్సంవిధానంబులం
ధరణి ప్రోద్భవు గంటి; సర్వదివిజాహ్వానంబులన్ వింటి; న
చ్చెరువై నా కిదె బ్రహ్మలోక మనిపించెన్ వేణుగోపాలకా!

ఆగమ నిధులు, తపోమూర్తులైన శ్రీ వేదాంతం పద్మనాభాచార్యులవారు హోమకుండలములలో అగ్నిని ప్రతిష్ఠించుటకు ముందు వేదోక్తప్రకారం అరణియందు అగ్నిని ఒకటిన్నర నిమిషములలో సాధించారు.

ఇది ఆ యజ్ఞ సన్నివేశములలో చాలా మహోత్కృష్టమై ఆబాలగోపాలమును అచ్చెరువొందించిన మహత్తరమైన సన్నివేశం!

శ్రీ రుక్మిణీసత్యభామాసమేతుడైన వేణుగోపాలస్వామికి, క్షీరాభిషేకము, పంచామృతాభిషేకములు గావించారు. కళలను వేదఘోషలతో కుంభములయందు నిక్షేపించి, ఆ తరువాత బింబములలో ఆవాహము చేశారు. ఆ క్రియాకలాపములన్నీ చూచి తీరవలెనే కాని, చెప్పనలవికాదు.

నవరత్నములు, గైరికాది ధాతువులు మొదలైనవి పీఠములో ఉంచగా, శుభముహూర్తమున వేదఘోషలతో మంగళవాద్యములతో, భక్తుల మనోభీష్ట స్తోత్రములతో, ప్రజల హర్షధ్వానములతో తుకారాముని ఆనంద బాష్పములతో శ్రీ రుక్మిణీసత్యభామా సమేతులైన వేణుగోపాలస్వామివారు పునః ప్రతిష్ఠితులయారు.

తలపన్ భోజ్యము భోక్తలున్ హవియు హోతల్ వేద్యమున్ వేదితల్
వెలయన్ జ్ఞేయము జ్ఞాతలున్ సకలమున్ వీక్షింప లోలోన ని
ష్కలమున్ బుష్కల మవ్యయంబు నయి దిక్కాలంబులన్ ప్రింగి, ని
శ్చలమున్ శాశ్వతమైన తత్త్వమవు కృష్ణా ! వేణుగోపాలకా !

ఈశ్వరాంశ సంభూతులైన మా నాయనగారు స్వామివారికీ రీతిగా శుభాశంసనములు పల్కినారు.

చెలువంబొప్పగ నేను నా గృహిణియున్ శ్రీరుక్మిణీ సత్యభా
మలతో దేవర పెండ్లి వేడ్క సవరింపన్ గంటి మిన్నాళ్ళు : కిం
పొలయన్ నెవ్వగలెల్ల బాసిన మదిన్ బాబోదులున్ నీవు: నొ
చ్చెల ! యెన్నం దెడబాటు లేక మనుడీ ! శ్రీ వేణుగోపాలకా !

ఏమిటయ్యా స్వామీ అలా చూస్తావేం?

"చిర విశ్లేష భరాలసాలసలు నీ చిన్నారి పూబోండ్లు వ
చ్చిరి నీకై పదరాని పాట్లు బడుచున్ జేకోమి నీ కానటే?"

అనగా స్వామివారు మందస్మితం చేశారు

తెరవౌ జన్మపరంపరాధ్వముల నన్వేషించుచు న్నిన్నె యా
సరి వేసారుచు నేను వచ్చితిని కృష్ణా వేణుగోపాలకా!

చేకొనుట ఒక్క వారినే కాదు సుమా - ఎందుకంటే -

నిను నోలార్చెద జూడు ! నిర్జరగవీ నిర్యద్రస క్షీర మో
హన డిండీర పృషన్నిషిక్త నవబర్హ స్ఫార జూటంబుగా
నను నెవ్వానిగ జూచితో ! పరశివానందాభిషేకోన్మిషత్
జనిధారా పరిపూత చేతసుడ కృష్ణా ! వేణుగోపాలకా !

రుక్మిణీ సత్యభాముల నడుమ తనవంక చూస్తున్న స్వామివారు వేములమడలో యిలా వేంచేసిఉన్నారు.

కనలున్ శోకము పిక్కటిల్లు కనులన్ గన్గో నినున్ బుల్కు పు
ల్కున భోజాత్మజ; కొల్లపోయిన నగన్ గొన్నట్టె హర్షంబు దా
చిన నేత్రచ్ఛవి సత్యరీవు లొలయించెన్ : వంచితాపాంగ ! ని
ల్చిన నీ తీరది యేమియున్ దెలియనట్లే ! వేణుగోపాలకా !

శ్రీః

మల్లంపల్లి కామాక్షి కనకదుర్గ

శ్రీ వేణుగోపాల శతకము

(వేముల మడ)

శ్రీమన్నీలపయోధరాంగ! కరుణా శ్రీమందిరాపాంగ! ని
స్సీమానాది రజో విభంగ! శ్రితరాజీ చాతకాఽ సంగ! వం
శ్రీ మంద్రస్తని తానుషంగ! సకృదాశ్లేషోన్మిష ద్యావత
శ్రీమద్విద్యుదభంగ! వేములమడ శ్రీ వేణుగోపాలకా! 1

మౌళిస్ఫార మయూరపింఛభరమై మాహేంద్ర నీలద్యుతి
వ్యాలోలాలక ఫాల మొప్పెసగ వ్యత్యస్తాంఘ్రిపద్మంబులన్
కేళీమోహనమౌ త్రిభంగి వలిత గ్రీవంబుగా నిల్చు నీ
లీలాఽ కేకర దృష్టి ప్రోచు భువనాళిన్ వేణుగోపాలకా! 2

"మడ"కున్ దేవర రాక చిత్రము త్రియామామధ్యయామంబు స
వ్వడి లే కాంద్ర మొరంగి నిల్చితి విటన్ వంశీసహాయుండవై
ఎడబాటగ్గికి నెంత మ్రగ్గిరొకదా యిల్లాండ్రు! మైనుండి; యె
య్యెడలన్ గుండెలుతీయు బంటువన నీవే! వేణుగోపాలకా ! 3

మా పాలన్ గృప యింత యంచెరుగమే! మా పల్లె కే తేరగా
గోపాలా! నెవరైన నీ చిగురుటాకుం బోండ్లపై నెమ్మదిన్
కోపాలా? యెవరయ్య నెయ్యములు? నీకున్ లోదిగుల్ మాన్పగా
తాపాలా? యుసురుస్సు రందు! వలవంతన్ వేణుగోపాలకా! 4

వరవాల్లభ్య విశేష వంచితమతిన్ వైదర్భి తా నేమరన్
సరి జాామై స్మరకేళి సొమ్మసిలగా సాత్రాజితీదేవి: ని
ర్భర జాగ్రత్ పరిపూర్ణ నిష్కల పరబ్రహ్మాంబ, వీ, విందు శ
ర్వరిలో నివ్వరి ముల్లువై నిలచితౌరా! వేణుగోపాలకా! 5

నీ వంశీధ్వని వాహినుల్ వరదలై నిండార బ్రహ్మాండముల్
ద్యో వీథిన్ గ్రహతారకాగణము చిందున్ బిందులై బిందులై
జీవాంతర్ హృదయాంబరంబు నినదించెన్ స్పందమై మంద్రమై
నీ వేణుధ్వని స్థూల సూక్ష్మములు నిండెన్ వేణుగోపాలకా! 6

మందస్మేర ముఖారవింద సుషమా మాధుర్య వారాంనిధీ!
కందర్పుల్ శతకోటులైన నెగయంగా నిందునన్ బిందులే!
కెందమ్ముల్ చరణమ్ము లొండొకటి పైగీలించి మేలెంచి నా
డెందంపున్ విరిమొగపై నిలువు మిట్లే; వేణుగోపాలకా! 7

ఉదయింపంగదె! నెమ్మిగ్రమ్మి హృదయవ్యోమావకాశంబునన్
ముదిరానీలముగా మనోజ్ఞ సుషిర స్ఫూర్జ న్నినాదంబుగా
సదయాపాంగ తటిత్తు గాగ గరుణాసార ప్రవర్షంబుగా
బ్రిదులుం బింఛపు సౌరకార్ముకముగా శ్రీ వేణుగోపాలకా! 8

నీ యొయ్యారమె నిండె లో యెదదలో నిర్వ్యూహ బర్హంబుగా
ప్రేయోహాసము గాగ పార్శ్వవలిత గ్రీవా విలాసంబుగా
తోయేజాభ విలోచనమ్ములుగ కస్తూరీ నిటాలంబుగా
మై యెల్లన్ దొలికారు క్రొమ్మొయిలు మంపై వేణుగోపాలకా! 9

సదయా! యింద్రియ ధేనువుల్ విషయ ఘాస గ్రాసలోలమ్ములై
బ్రదుకుం బీడుల బట్టి నిన్ మరచి పోవంబోవ బ్రాయంపు బ్రొ
ద్దదె! డిందన్ బయి గ్రమ్ము చీకటులలో నల్లాడవే? సుంత, నీ
మృదువౌ మోవిని పిల్లగ్రోవి నిడవేనీ! వేణుగోపాలకా! 10

స్మయ దబ్జాక్ష! ఘటింపవే! యెపుడు నా స్వాంతంబునన్ నీదు ప
ల్లియయో! నల్లనియేరొ! పచ్చబయలో! లేదూడలో! జారువ
ల్లియయో! పిల్లనగ్రోవియో! నెనరులో! లేజూపులో! నెమ్మిపిం
చియమో! వంచిన యోరమోము సవురో! శ్రీ వేణుగోపాలకా! 11

ఒప్పుల్ కుప్పలు వోసిన ట్లలరు నీ యొయ్యారమే యెంతునో!
చిప్పం గూకట నెమ్మికంటి హరువౌ సింగార మూహింతునో!
కప్పున్ దిక్కులదావి నెన్నొసటిపై కస్తూరి ధ్యానింతునో!
చెప్పంగిప్పగరావు నీ హొయలు, లో శ్రీ వేణుగోపాలకా! 12

మృదులాలోల కరాంగుళీ దళిత వంశీరంధ్ర గర్భంబులన్
పొదలన్ మిన్నులు బూరటిల్లగ రసాంభోరాశి; యేనాటివో
హృదయ గ్రంథులు వ్రీల వ్రాలి రబలల్ వ్రేపల్లె పై యెల్లలన్
ప్రిదులు న్నీవులు జారు క్రొమ్ముదులునై శ్రీ వేణుగోపాలకా! 13

శితపింఛేంద్ర ధనుస్సమంచిత! కృపాసించ న్నవాంభఃకణ
క్షత పృథ్వీ నవగంధ బంధుర! దిశాపుంజీ భవత్ పారణ
వ్రతకృచ్చాతకవ ద్వినీతజన! గోపాలాంగనాపాంగ ని
ర్మిత విద్యుద్వలయాంబు దాంచిత వపు శ్శ్రీ వేణుగోపాలకా! 14

నవనీతప్రియ! నీదు కెంబెదవి పైనన్ గజ్జలాంకంబులే?
లవలీ పల్లవగల్ల! మీ గళ మదెల్లన్ గంకణాంకంబులే?
సవురౌ మీయుర మెల్లెడన్ – శివ శివ! శ్యామా పదాంకంబులే?
చివురుం జెక్కిలిపై నఖాంకములెపో! శ్రీ వేణుగోపాలకా! 15

సరి సామంతుడు మంతు కెక్కుచు బళీ! సంయోగ శృంగార భా
వ రసైకాశ్రయమూర్తి యీ కెలన నిల్వన్ 'మొవ్వ' గోపాలుడున్
నెరవై యాంధ్రుర బాసి 'వేములమడన్' నీ వుంటివే! విప్రలం
భ రసాలంబనమూర్తివై యిచట; దేవా! వేణుగోపాలకా! 16

నీ మేనెల్లను నల్లనై వ్రజవధూ నిశ్వాస ధూమంబులే
ప్రామెన్; నీ యెద నిండె గోకులసతీ బాష్పాంబు గర్భంబులే;
మై మై పచ్చని యొల్లె క్రొమ్మెరుగు సంబాళించినన్, నీ తనూ
శ్రీ మర్మంబు నెరుంగ రెవ్వ రిచటన్? శ్రీ వేణుగోపాలకా! 17

నీ మై నీడల నల్లనల్లన ప్రభూ! నిండింపవే! యాంతర
వ్యోమం బంతయు నంత నంత శిశిరీభూతంబుగా; కాలదిక్
సీమల్ దాటిన తెల్వి నెమ్మినయి నే గ్రీడించెదన్; నీరద
శ్యామంబైన వెలుంగులోన బురివిచ్చున్ వేణుగోపాలకా! 18

కుందక్షీర మృణాళహంస నిభముల్ గోబృందముల్ ధ్యాన ని
ష్పందంబుల్ నినుజుట్టి నిల్చి నవయా! సమ్మీలితాక్షంబులై
బృందారణ్యము త్రోవ లెల్లెడల నాపీన స్రవత్ క్షీరముల్
చిందుల్ మానిన లేగదూడగములై శ్రీ వేణుగోపాలకా! 19

నీ సృష్టిన్ గన నాల పుట్టు వొకడే నిర్వ్యాజ భద్రంబగన్
ఘాసంబో! జలమో! శరీరధృతికై కాంక్షించుచున్ జీవనా
యాసంబుల్ దిగనాడి రేపకడలన్ హార్దామృత స్యందమై
శ్రీసంపన్న మొనర్చు సృష్టి నెపుడున్ శ్రీ వేణుగోపాలకా! 20

వలనొప్పారగ భూర్భువస్సువ రభి వ్యాలీఢ, మానంద పి
చ్ఛిలమౌ మీ సుషిరోద్గతంబు ప్రణవక్షీరంబె ప్రోయాంధ్ర క్రొం
దలిరుం డెందము లాబొదుంగులను నిండారంగ; నానాటికిన్
వలపుల్ వెన్నలు నయ్యెబో! మది తలంపన్ వేణుగోపాలకా! 21

వలపుల్ వెన్నలు వెన్నెలల్ వెలదులున్ వత్సంబులున్ ధేనువుల్
తలిరుల్ పూవులు తేనియల్ ఋతువులున్ ధర్మంబులున్ వ్రాలు సం
జలు లే సంజలు నారబంబులు తరుల్ ఛాయల్ నవాబ్దంబులై
చెలగున్ మీ చెలువంబె క్రొత్తలగుచున్ శ్రీ వేణుగోపాలకా! 22

సుమ గర్భంబుల తేనె, నిండునెలలన్ జ్యోత్స్నామృతం బబ్ద గ
ర్భములన్ నీరము, శాలి గర్భముల క్షీరం, బాల, యాపీన గ
ర్భములన్ స్నిగ్ధ వయస్సు, వేణు జడ గర్భంబందు సుద్గీథ, మ
భ్రము నాగుండియనైన లోతు లుబికింపన్ వేణుగోపాలకా! 23

చిర విశ్లేషభరార్తి సంశ్లథ తనూ శ్రీమల్లికా మాలతుల్
శరకాండ చ్ఛవి పాండు గండ యుగళీ స్రస్తాలకల్ బాష్ప ని
ర్భర నిశ్వాసముఖుల్ ప్రజాగరదశా రారజ్యమానాక్షు, ల
చ్చెరు విచ్చే నిను జేరి రిర్వు రబలల్ శ్రీవేణుగోపాలకా! 24

వెన్నల్ ముచ్చిలు నేర మేమగునయా! వ్రేపల్లె యిల్లిల్లునన్
నిన్నే ముచ్చిలినారు వేములమదన్ నీకన్ననున్ గన్నగా
ళ్ళిన్నూ రేదులు దాటి యీ యెదరునం దీ యన్ను, లా యల్లక
స్విన్న స్వాంతలు కా, గతంబు గలదే? శ్రీ వేణుగోపాలకా! 25

అవియున్ గుండెలు, నిండుకోర్కి బరువై ప్రాలంబి నీలాంబుద
చ్ఛవి సమ్మోహనమౌ తనూసుషమ, పక్ష్మ ప్రాంత నిష్పంద వృ
త్తి విశేషంబున నుత్పిబాయిత లస న్నే త్రాంజలుల్ పూన్చి, యీ
చివురుంబోదులు దప్పి దేరెదరయా ! శ్రీ వేణుగోపాలకా ! 26

కనలున్ శోకము పిక్కటిల్లు కనులన్ గన్గో, నినుం బుల్కు పు
ల్కున భోజాత్మజ; కొల్లవోయిన నగం గొన్నట్టె హర్షంబు దా
చిన నేత్రచ్ఛవి సత్యరీవు లొలయించెన్ : వంచితాపాంగ ! ని
ల్చిన నీ తీరది యేమియున్ దెలియనట్లే ! వేణుగోపాలకా ! 27

సిరి నిండారిన తమ్మి మొగ్గ గురుతై శ్రీరుక్మిణీ స్ఫూర్తితో
నరసీజాలయ నిల్వ నీ వలపటన్ : సాత్రాజితీ మూర్తియై
ధరణీదేవియు డాయ డాపట: భవదాక్షిణ్య సంపత్తియే
సిరులై సంపదలై జగంబు మనుచున్ శ్రీ వేణుగోపాలకా ! 28

శమితోపప్లవ మబ్ద మంబరమునన్ ఛాయా వితానంబు దీ
ర్చె; మృదుక్షోణి నవాంకురార్పణ మెలర్చెన్ : నూతనారంభ సం
భ్రమ విద్యోతిత కౌతుకంబు లలరెన్ పల్లీ పదంబుల్ : రమా
క్షమలన్ బెండిలియైతి ! పండు నిక వేడ్కల్ వేణుగోపాలకా ! 29

ఆట వ్రేపల్లెయు నా కళిందజయు బై నా బృందయు న్నీకు మి
క్కుటమౌ మక్కువపట్టులై వెలయ గైకో కీవు కృష్ణానదీ
తటమం దీ దివిసీమ పున్నెమున గాదా ! నచ్చికై నల్ల రే
గటి మాగాణికి మచ్చి కౌచు వలంవగా, వేణుగోపాలకా ! 30

ఇల నీ నిల్చినచోట సజ్జనత, గోబృందంబు, ధర్మంబు, మా
టలు, మర్యాదలు, మంచి, పాడియున్, పంటల్, సౌమనస్యం, బనా
కుల భావంబె రహించు నెల్ల యెడలన్ గోవర్ధనాక్రీడ ! ప
ల్లెల దైవంబవు నీవె పింఛనవమౌళీ ! వేణుగోపాలకా ! 31

శరదబ్జాక్ష ! యుషస్సు విచ్చె ధవళాబ్జంబట్లు ప్రాచీసరో
వర గర్భంబున సృష్టి కెల్లన్ నవీభావంబు సంధిల్ల సత్
కరుణన్ దేవర మా కొసంగు నగందకా రౌషధం బూర్జిత
స్థిర భద్రంకరణంబు సేవ్య మెపుడున్ శ్రీ వేణుగోపాలకా ! 32

మంధాకర్షణ రజ్జుబంధమె కృపామౌగ్ధ్య ప్రమాణంబుగా
సంధింపం దొలినాడు దేవరకు; పై సాత్రాజితీ మేఖలా
బంధంబున్ బయిపై ప్రపన్న జనతా బంధంబులున్ దప్పవే !
బంధంబుల్ మరి నీవ నేర్తు తెమలింపన్ ! వేణుగోపాలకా ! 33

చిందింపం గరుణింతు బిందువులుగా; శ్రీనీరదాకార ! నా
డెందంపున్ బొల మావిరుల్ గనియ నిందే య్యెండో ! రెండో ! వచ
స్స్యందంబుల్ ; నిగిడింప రాదొకొ ? సుధా సారైకధారల్; గవీ
బృంద ప్రీణన ! లోకహర్షణ చణ ! శ్రీ వేణుగోపాలకా ! 34

అరుదై యే క్షణ మెట్టులో యెరుగకే యాబ్రహ్మకల్పంబుగా
స్థిరమై యీ బ్రదు కిట్లె సాగునని భ్రాంతిన్ జీవి పొర్లాడు ట
చ్చెరువై తోచు; సుఖంబు దుఃఖమని దుశ్చింతామతిన్ సారె బ్రు
చ్చిర నేలా ? భవదీయ లీల నడపన్ శ్రీ వేణుగోపాలకా ! 35

తెరలెత్తన్ బయిదింప రేబవళు లెంతే: ఘూర్ణమానార్ణవాం
తర మందీ దెసలేని నావ చన; నానాద్వీపముల్ వోలె ద
వ్వరుగన్ శైశవ యౌవనాదు; లదె ! సాయాహ్నంబు నంతంత, ద
గ్గరయై డిగ్గురులయ్యె గుండియ, సరంగా ! వేణుగోపాలకా ! 36

ఎలమిం గాటపు నిద్ర కన్దెరచి నే నే యూరా! యే సీమయో!
తెలియంబోయెదునంత వెండియు తమోஉధీనత్వమై కూర్కు బి
ట్టలమన్; బుట్టువు పుట్టువిట్లె జడనిద్రాయత్తమై డింద, న
ర్మిలి నేనాటికి గూర్తు బోధ సుషమల్? శ్రీ వేణుగోపాలకా! 37

తెలి నెమ్మేను గదించి నీ వెనుదెసన్ దీపారగా మోర న
ర్మిలిమై నోరగ జాచి త్వచ్చరణ సామీప్యావనిన్ నెమ్మదిన్
నెలనై వెన్నెలప్రోవు గోవాక డిటన్ నీలాంబుదశ్యామ! నీ
చెలువం బానెడు దోనెలైన కనులన్ శ్రీ వేణుగోపాలకా! 38

తలపుం జోంపము సందుసందుల బడిన్ దా నొక్క శబ్దంబు వె
న్నెలయై నీ కృప దోచినంతనె పురానిర్ణీత సందర్భమై
వలయం బేర్పడినట్టు లెన్నటిదియో పద్యంబె నా సంస్మృతిన్
జెలగం బోలును నీవె సంస్ఫురణమై శ్రీ వేణుగోపాలకా! 39

పొదలన్ వేణువులో నినాదముగ నూర్పుల్ మౌళి పింఛచ్ఛవుల్
కదలన్ గంకణ కింకిణీ కిణికిణి క్వాణంబు నా వీనులన్
మెదలన్ లోయెద జాడ్యమెల్ల వదలన్ నీలద్యుతీ! నెవ్వగల్
ప్రిదులన్ మన్నన నన్ను దాయు టెపుడో! శ్రీ వేణుగోపాలకా! 40

అతసీ సూన సవర్ణ! మత్తను మనః ప్రాణంబులన్ నీ కరా
ర్పిత వంశంబుగ జూడు! జాగర సుషుప్తి స్వప్న మార్గంబులన్
వితయై యూరుపు టేరు పారు; నిట నీ నిశ్శ్వాస మల్లంత నిం
చితి వే నిందు భవంబు సార్థకమగున్ శ్రీ వేణుగోపాలకా! 41

దధి కుంభోంభిత మంథ మంథన వలద్ ధ్వానంబులన్ దిక్తటుల్
బధిరీభావము నొంద, జిరదులుగ నంభా జృంభితారావ మం
బుధి భంగౌఘము లీల లేగగమి యుప్పొంగన్; గవీ బంధన
శ్లథనాహర్ముఖవేళ నీ కివె నమస్యల్! వేణుగోపాలకా! 42

అలమన్ మిన్నులు ద్రింగి యాపదలు తా, మద్రీంద్ర కల్పంబులై
తల పెల్లన్ జెడి రేబవల్ నిబిడ చింతన్ స్వాంత ముద్ర్భాంతమై
తలరన్ శైలము తూలమై విరియ త్వత్కారుణ్య వాతూలముల్
చెలగన్ వీచుట చెప్ప చిత్రము సుమీ ! శ్రీ వేణుగోపాలకా ! 43

పులి నాకన్ విడివడ్డ గోవు గతి నంభోజాక్ష ! నా గుండియల్
కలగంబారుచు దేర వింతయిన శంకాతంకముల్ మాన్పి ని
శ్చల భావం బొనగూర్చి సంశయభయ స్థానంబులన్ ద్రోయ క
ర్మిలి నేడ్రాదు ఘటింపు ! స్వాస్థ్య కలనన్ శ్రీ వేణుగోపాలకా ! 44

మతి నే యత్నము లేదహో ! సహజమౌ మాంద్యంబె బోధంబనన్
సత మీ జీవిత మిట్లు సాగెదు యదృచ్ఛా ప్రాప్త భోగంబె, యా
యతి, నీ యైహిక మెట్టులైనను-ప్రభూ ! అముష్మికబందు వం
చిత మైనన్ దెరు వెట్టు లంచితదయా ! శ్రీ వేణుగోపాలకా ! 45

తన నీడన్ గడవంగ లేనిదియె కాదా? ప్రాణి; పైపై ఖగం
బును మింటన్ దన రువ్వ దాటి నెగయంబోలేదుగా! కట్టు గొ
య్యనె చుట్టున్ గద! గోవు కంఠగత పాశాయామమై; నీ సృజిం
చిన యీ మాయయు నన్ను బాయ దకటా! శ్రీ వేణుగోపాలకా! 46

నను మన్నించితి వెన్నియైన గతులన్ నా ప్రాణకందంబ! మత్
జననీగర్భమునందు బుట్టవు యథాజాతత్వమున్ మాన్పి మత్
జనకుం డిచ్చిన బోధ మార్యజనతా సంసర్గమున్ నిన్ దలం
చిన లోలోనె కరంగి మైమరచుటల్ శ్రీ వేణుగోపాలకా! 47

క్షితి నే బుట్టిన పుట్టు వెట్టి దయినన్ శ్రీయోగమేయైన దు
స్థితియైనన్ సుఖదుఃఖ వేళల జనుఃశ్రేణీ మిళద్వాసనా
గతులన్ బమ్మెరవోయి నెమ్మనము చీకాకైన నీయంద వి
స్మృతి యొక్కం దది చాలు జన్మతతికిన్ శ్రీ వేణుగోపాలకా! 48

భువి నే యర్థములైన నిన్ను నడుగన్ బోనయ్య! నాజియ్య! యే
లవి? యానుశ్రవికంబులేనియును నొల్లన్, జెల్ల! త్వన్నాభి సం
భవ పద్మప్రభవాది భవ్యుల కలభ్యంబైన యేకాంత వృ
త్తి విశేషంబు నన్య మిమ్ము శమితార్తీ! వేణుగోపాలకా! 49

సకలాజాండ కరండ గర్భకుహళీ సంపూర్ణ నాద ప్రవ
ర్తక భావం బఖిలాగమాంత పరిపూర్ణ ఖ్యాతియున్, మౌళి చం
ద్రకమున్ గోపరిపాలనైకరతి కాంతారాంత సంచార మెం
చికొనన్ వంచన లేదహో! శివుడవే! శ్రీ వేణుగోపాలకా! 50

వెదుకన్ నిన్ వెలి నెన్ని జన్మములకున్ వేసారుటే; ప్రొద్దు చా
లదు లోఁజీకటులన్ దమాల తరుజాల చ్ఛాయలన్ నీల నీ
రద కాంతిచ్ఛటలన్ ప్రభిన్నశిఖి బర్హచ్ఛన్నమై లోగు రూ
పిది! యే లీలల జొచ్చి పట్టనగు నోయీ! వేణుగోపాలకా! 51

నిన్నున్ మించి జగద్గురుత్వ పదవిన్ నిర్వాణ తత్త్వార్థ సం
పన్నా కారము మూడు కాలములలో భావింపగారాదు; పై
నెన్నన్ నిన్నును మించి వేరొకయెడన్ శృంగార లీలా మహ
స్విన్నా కారమునైన కానముగదా! శ్రీ వేణుగోపాలకా! 52

తలతున్ నీ వని రాకయే చరమసంధ్యా వేళలన్ గోఖు రా
చల చంచత్పదవీ రజః పటల సంఛన్నాల కాబ్దాంత పే
శల చంద్రోదయవ ద్విభాసి లలితాస్యస్ఫూత గోపీదృ గం
చల నీలోత్పల సించితామృత కటాక్షా! వేణుగోపాలకా! 53

చ్యుతమై యుత్తర వాయువీచి హతులన్ జొక్కాకులై రాల; సం
చిత మాగామియునైన కర్మతతి, వీచీ దక్షిణాశానిలా
ఉ హతులన్ మిన్నక మ్రోయు రేబవ, లెదన్ హత్తింపవే! నా హృదం
చిత వంశంబు కరాంచిత ప్రణయవంశీ! వేణుగోపాలకా! 54

విరహం బూర్పుల నింతు; నీ నెనరు గ్రోవిన్ దేటయౌ పాటయై
పొరలన్ స్థావర జంగమంబుల హృదంభోజంబులన్ బ్రేమ ని
ర్భర నిష్యందము జీవభావమె లయింపన్ బిందు నిశ్శేషమై
చిరబంధూ! రససింధు గర్భములలో శ్రీ వేణుగోపాలకా! 55

నీ మాయాగుణజాల కర్బుర జగన్నిర్మాణ వైచిత్ర్య ని
స్సీమ ఖ్యాతియె లోక మోహనకళా శృంగార లీలాంకమై
నీ మౌళిన్ నెలవై మరుచ్చలితమై నీలాలక శ్రేణిపై
శ్రీమద్బర్హవిభూషణంబుగ నటించెన్ వేణుగోపాలకా! 56

ఇరవై లోయెద దాగి పొంచినవి న న్నే వాసనల్ ముంచునో!
యెరుగన్ రాదు; గుణప్రవాహములు న న్నే తీరమున్ జేర్చునో!
వెరపయ్యెన్ జుమి! కాల కర్మ కలనావేశంబులన్ నీదు సు
స్థిర కారుణ్యమునందె మేల్కొలుపవే! శ్రీ వేణుగోపాలకా! 57

శ్రితమందార! ననున్ భవచ్చరణ రాజీవ స్పృహాఉ చంచలాం
చిత శీలాంచితు లున్న యన్నెలవులన్ జేర్పంగదే! జీవితా
యతి యెల్లం దదనుగ్రహైక చిరపుణ్య ప్రాప్త యుష్మద్గుణ
స్మృతులన్ దెందము కందళింప మనెదన్ శ్రీ వేణుగోపాలకా! 58

ప్రియబంధుల్ చన నొక్కరొక్కరుగ నావిర్భూత చింతాజడం
బయి నానాటికి శూన్యభావమె భజింపన్ డిందె నబ్బంబు లె
న్నియొ! దెందంబిది నేడు నీ కరుణ నన్వేషించినన్ శాశ్వత
ప్రియబంధుండవు నీవ యెల్లయెడలన్ శ్రీ వేణుగోపాలకా! 59

తత మాయా గుణజాల సంవలిత మత్స్యప్రాయమై ప్రాణి సం
తతి మోహార్ణవ మీదుచున్న యది; యంతర్నిశ్చలాకార! మున్
ధృత మత్స్యాకృతి వార్ధి వేదతతి నన్వేషించు నీ నేర్పు పం
చితివే నించుక నిన్ను గానననగు నో శ్రీ వేణుగోపాలకా! 60

పొరి నంతంతలుగా సురాసుర గణంబున్ బౌరుషోద్భ్రాంతమై
శరధిన్ ద్రచ్చి గజాశ్వ ధేను మణి యోషా శ్రీ సమున్మేష మ
బ్బురమై బుద్బుదలీల పెల్లెగయ; దుర్మోహంబునన్ లోని సు
స్థిర దైవంబగు కూర్మమున్ గనరహో! శ్రీ వేణుగోపాలకా! 61

నెరి నవ్యక్త మహార్ణవంబున తమో నీరంధ్ర గర్భంబునన్
విరియన్ బ్రత్యణువున్ రసాతలమునన్ విభ్రాంతిమై. తూలు, ను
ర్వర నేనొదును; కేతకీ ముకుళ భాస్వద్దంష్ట్రపై దాల్చి, సు
స్థిర భావంబు ఘటింపుమయ్య! కిటిమూర్తీ! వేణుగోపాలకా! 62

భరితైనః పటలీ మహాంధ్యభరితంబై యాయస స్తంభ ని
ర్భరమై పేర్చిన నా హృదంతరమునన్ బ్రధ్నాంశు భాస్వత్సటా
భర సంరంభ విజృంభితోత్పతన శుంభద్దంభ సింహంబవై
తెరలన్ రాదె! పటాలునన్ నృహరిమూర్తీ! వేణుగోపాలకా! 63

తిరియన్ నైజములైన మూడడుగులన్ దిక్కాలముల్ లేని నీ
వరుగన్ నెట్టిక సీలవై బలివదాన్యాభ్యర్చనన్ భూనభోం
తరముల్ పట్టక పొంగి బిట్టెగసి యంతంతై విజృంభించు, న
త్తెర గేమందు? త్రివిక్రమాక్రమితకీర్తీ! వేణుగోపాలకా! 64

నెరయన్ రాజస లోభ మోహ మదముల్ నిండారి లోలో బొరిం
బొరి నీ గొడ్డటి వాదరన్ నురుముచో ముయ్యేడుమార్లైన; ము
మ్మరమై క్రమ్మర మొల్కలెత్తు గుణమున్ మాయింపవే! నీ యశ
స్ఫిర హంసావళి దూట క్రౌంచబిలమున్ శ్రీ వేణుగోపాలకా! 65

నీకళ్యాణగుణంబులే యుడుతతుల్! నీ కీర్తులే కార్తికీ
రాకాజ్యోత్స్నలు! సర్వలోక హృదయారామాభిరామాకృతీ!
నీకంటెన్ పురుషోత్తముండు గలడే? నీరేజ భూసృష్టిలో!
శ్రీకాకుత్స్థ మహాన్వయామృతకళా! శ్రీ వేణుగోపాలకా! 66

హాలాసంగముపై హళాహళి యొకం డాపై హలాఽ సంగమున్
కాళిందీ సలిలాపకర్షణ కళా కౌశల్య గౌపాల్యముల్
పోలన్ జూచిన నీల వస్త్ర ధరణంబున్ గర్షకత్వాభి మా
నా ఽలీఢాంతర వృత్తి దెల్పు బలదేవా! వేణుగోపాలకా! 67

ఘృణ నీ యుల్లమునందె పెల్లుబికి పొర్లెన్; జన్మ సంస్థాన వ
ర్ధన పాకక్షయ నాశ నామక వికారశ్రేణి కెన్నన్ బ్రతి
క్షణమున్ లోనగు గాదె దేహములు? యజ్ఞం బొల్ల బాటో? ప్రతా
రణ మేలా యొనరింప? బోధ మతిధారా! వేణుగోపాలకా! 68

మతి బెంపారిన మ్లేచ్ఛభావము లడంపన్ రేచితోద్వృత్తధా
రితకాఽ స్కందిత వల్గిత ప్లుతగతి శ్రేణీ ముహుస్సంవలత్
సిత కంఖాణము రింఖ ప్రేంఖణము వర్తింపంగ నర్తింపవే!
శిత ఖడ్గాంచల చంచలాంచిత రుచిన్ శ్రీ వేణుగోపాలకా! 69

ప్రచురోదంచిత సౌరకార్ముక లసద్బర్హావతంసచ్ఛవి
ప్రచయాలంకృత నీల కుంతలభరా! భాస్వన్మణీ కింకిణీ
నిచయాలంబిత మేఖలా కలకలా! నీ రేజ బంధుప్రభా
సి చయో న్మీలిత నీల నీరదకళా! శ్రీ వేణుగోపాలకా! 70

ఎలయింపన్ బనిలేదు నీ కిచట నింతే; రేపునన్ మాపు నా
తలపుం దల్పిది యోరవాకిలియె; యంతర్మోహనాకార! లో
పల నీ వెవ్వరొ నే నెరుంగ కితర వ్యాసంగమై యుంటి; మ్రు
చ్చిల నా గుండియ వెన్న నీ కనువుగా శ్రీ వేణుగోపాలకా! 71

నిను రమ్మన్నది యెవ్వరోయి యిచటన్? నీ వెవ్వ? రే నెవ్వ? రే
జననంబందినదాది నిన్నెరుగ; నెంచన్ నీది మాయూరి ప్ర
క్కనే యేయూరొ యటం చిటీవలె వినంగానయ్యె; నా గుండె సొ
చ్చిన నీ గుండియ నిబ్బరంబె వెరగౌ! శ్రీ వేణుగోపాలకా! 72

లీలాఽ లోల కటాక్షజాలముల నోలిన్ బ్రహ్మజాండంబులన్
పాలింపన్ సమయింప వెండియు సృజింపన్ మూలమైయుండియున్
పాలున్ వెన్నల కాలధూళులు మెయిన్ బారాడ గోరాడుచున్
వ్రేలన్ గూడి నటింప మేలమె కదా! శ్రీ వేణుగోపాలకా! 73

పారంబందని యెన్ని పుట్టువులకున్ భావింప నిస్సార సం
సారంబందున సార మీ వొకడవే; సంవిస్మయాకార! సం
సారం బంతయు సారమై చను భవజ్జన్మక్రియాతత్త్వ వి
స్మేరాంతఃకరణారవిందులయినన్ శ్రీ వేణుగోపాలకా! 74

నీ కారుణ్యమునందె మేలుకొనగా నీయందె కన్మూయగా
నా కీ లోక ఋణానుబంధ మిది యెన్నాళ్ళెన్నినాళ్ళో ప్రభూ!
ఓ కారుణ్యపయోనిధీ! మనుపవే! యో దీనచింతామణీ!
చీకుంజింతల జిక్కి స్రుక్కనిగతిన్ శ్రీ వేణుగోపాలకా! 75

నా యిష్టంబని యున్నదే? నరసఖా! నా మేని తే రెక్కి పై
నీ యిష్టంబుగ దోలి యింద్రియ హయానీకంబులన్ సంశయ
ప్రాయాధ్వమ్ములయం దెగుళ్ళను దిగుళ్ళై డిందు నా డెందమున్
శ్రేయ స్సుస్థిరసీమపై నిలుపుమీ! శ్రీ వేణుగోపాలకా! 76

వెనుకం దోలిన ముందు తోలిసను నీవే! మత్తనూ స్యందనం
బున బోధామృత హర్ష వర్షముల సంభోదంబవై క్రమ్మి పా
రణ సేయింపగ దేరుచున్నవి మనః ప్రాణంబు లల్లంత దే
రిన పై జూలు విదల్చు వాజుల ససిన్ శ్రీ వేణుగోపాలకా! 77

నరజన్మానుగతంబె పోల్చికొన నీ నా సఖ్యబంధంబు, వా
నరమై యాడుచునుండు నా మనమె పైనన్ నా పతాకంబుగా
నెరయన్ నా యెద నిండె క్లైబ్య మొకడున్ నిర్వేద మాపైని; చె
చ్చెర నీ కన్న నెవండు నన్ను గడపున్? శ్రీ వేణుగోపాలకా! 78

నను దీర్పన్ సని నీదు చేతి కశయైనన్ వేణువైనన్ విలో
చనమైనన్ స్మితమైన గీతమయినన్ సయ్యాటమైనన్ జిరం
తన బోధామృతమైన స్పర్శమయినన్; దత్తద్దశా యోగ్య మెం
చిన నీ మై యెడబాటు నోపనుజుమీ! శ్రీ వేణుగోపాలకా! 79

సకలప్రాణి హృదంతరస్థితుడవై సర్వక్రియాసాక్షివై
ప్రకటీభూత గుణాత్మమాయ నిటు సర్వా నేహమున్ ద్వంద్వ మో
హకభావంబు ఘటించి జీవులను సయ్యాటించు నీ నేర్పు లెం
చి కదా నిన్ను దలంచి సొమ్మసిలుటల్! శ్రీ వేణుగోపాలకా! 80

నేరన్ దిక్కులు నేర కాలకళయున్ నిండార వంశీ సుధా
ధారామోహన వారివాహ మమృతాంధ శ్చాపఖండచ్ఛవి
స్ఫారోదంచిత బర్హ కుంతల భరంబై : నిర్భరక్రీడ మా
యూరం బాడుచునుండె లోయెదద సాహో ! వేణుగోపాలకా ! 81

నిను నోలార్పగ పాల, గోవయిన కానేకాకపోతిన్‌గదా !
నిను కన్నారగా జూడ నే నెమలినేనినిన్ గాకపోతిన్‌గదా !
నను వంచింపనె కాదె యిట్టి నరజన్మం బిచ్చి తీ వంచు దూ
రిన నా డెందమె నొవ్వ నెవ్వగ గదా ! శ్రీ వేణుగోపాలకా ! 82

నిను నోలార్చెద జూడు ! నిర్ఝరగవీ నిర్యద్రస క్షీర మో
హన డిండీర పృషన్నిషిక్త నవబర్హ స్ఫార జూటంబుగా
నను నెవ్వానిగ జూచితో ! పరశివానందాభిషేకోన్మిషత్
జనిధారా పరిపూత చేతసుడ కృష్ణా ! వేణుగోపాలకా ! 83

సుకృతంబుల్ ఫలియింప నెన్నటివా ! యిచ్చో నిన్ బ్రతిష్ఠింప మ
చ్చిక రప్పించితి నన్ను నాగృహిణితో చిన్నారులున్ రాగ; వె
న్నకు వెన్నొగద! నీదు నెమ్మనము నెన్నంజాల; నీ దివ్య సీ
మకు భామాయుత రుక్మిణీ ప్రణయ భూమా! వేణుగోపాలకా! 84

చరితార్థత్వము నొందె పుట్టువు ప్రతిష్ఠాదివ్యయజ్ఞంబునన్
ధరణీసూక్తము మున్నుగా విహిత తత్తత్సంవిధానంబులం
దరణి ప్రోద్భవు గంటి; సర్వదివిజాహ్వానంబులన్ వింటి; న
చ్చెరువై నా కిదె బ్రహ్మలోక మనిపించెన్ వేణుగోపాలకా! 85

యజమానత్వము నాకు ప్రాప్తమయి తా నయ్యాగమాంభోది, ఋ
త్విజుడై సర్వము నిర్వహించె నిచటన్ వేదాంత వార్ధీందు దం
బుజగర్భుండన బద్మనాభసుధి: సమ్మోదంబు యుష్మ త్పదాం
బుజ భృంగాయిత సాధుసంగ మొసగుంబో ! వేణుగోపాలకా ! 86

గరుదాల్చెన్ గదె మేను ! తత్సవన దీక్షా కంకణాలంకృతి
స్ఫురితోదాత్త శుభోదయాకలన రేవున్ మాపు వేదోక్త వి
స్ఫురి తాశీర్వచనామృతా మరధునీ సుస్నాత భావంబునన్
చిరపుణ్యంబులు పండె నీ కరుణ చే శ్రీ వేణుగోపాలకా ! 87

చెలువంబొప్పగ నేను నా చెలువయున్ శ్రీరుక్మిణీ సత్యభా
మలతో దేవర పెండ్లి చేద్క సవరింపన్ గంటి మిన్నాళ్ళ : కిం
పొలయన్ నెవ్వగలెల్ల బాసిన మదిన్ బూబోదులున్ నీవు: నా
చ్చెల ! యెన్నం డెడబాటు లేక మనుడీ ! శ్రీ వేణుగోపాలకా ! 88

జటియై స్థండిల శాయియై తపమురాశ్రై యేకభుక్తాశియై
వటువై నీ చిర విప్రయోగ కలనన్ బ్రహ్మప్రయత్నంబునన్
ఘటియించెన్ నిను నాంద్రతోడ: గుడియున్ గట్టించె నీ కిందు, నె
చ్చటనున్ గల్గునె ? యిట్టి శీలములు కృష్ణా ! వేణుగోపాలకా ! 89

శివసంకల్పము కాగ నిన్నిట ప్రతిష్టింపించె నా చేత: శా
స్త్ర విధిన్ సాధుమనో ఽభిరాముడు తుకారాముండె: పై స్నేహ బాం
ధవముల్ తోడయి యంబ, భైరవుడు, పూనన్ గాశినాథాన్వయుల్
శివముల్ వీరి కనుగ్రహింపు మెపుడున్ శ్రీ వేణుగోపాలకా ! 90

జరుగన్ గాఢ తమో విలీనములు నిశ్శబ్దంబులై పెక్కు వ
త్సరముల్ నేటికి ఫాలబాలశశి భాస్వ త్సంవి దుద్యోతిత
స్ఫురణన్ నీ కరుణన్ దరంగితగతిన్ బొంగెన్ వచోగంగ: నీ
చరణాబ్జంబులపై పదింబదిగ కృష్ణా ! వేణుగోపాలకా ! 91

తలపన్ భోజ్యము భోక్తలున్ హవియు హోతల్ వేద్యమున్ వేదితల్
వెలయన్ జ్ఞేయము జ్ఞాతలున్ సకలమున్ వీక్షింప లోలోన ని
ష్కలమున్ బుష్కల మవ్యయంబు నయి దిక్కాలంబులన్ మ్రింగి ని
శ్చలమున్ శాశ్వతమైన తత్త్వమవు కృష్ణా ! వేణుగోపాలకా ! 92

తలపెల్లన్ దలుపై చెవింబడిన శబ్దంబెల్ల వంశీగళత్
కల శబ్దంబయిన యెల్ల రూపును నభః కాదంబినీ డంబర
చ్ఛలమై తావియు తాకునున్ జవియునై సర్వేంద్రియ వ్యాప్తమై
చెలగున్ గాక ! భవన్మహోవిభవమే శ్రీ వేణుగోపాలకా ! 93

చిరవిశ్లేషభరాలసాలసలు నీ చిన్నారి పూబోండ్లు వ
చ్చిరి నీకై పదరాని పాట్లు పడుచున్ గైకోమి నీ కౌనటే ?
నెరవౌ జన్మ పరంపరాధ్వముల నన్వేషించుచు న్నిన్నె, యా
సరి వేసారుదు నేను వచ్చితిని కృష్ణా ! వేణుగోపాలకా ! 94

కెలవేచన్ గిలికించితంబుల రహఃకేళీ మిళన్మంజు వే
ళల సాత్రాజితి యల్క నీ వనునయాలాపంబులన్ దీర్చు, న
క్కెలసంబందున గాని యేమరకువే ! కేళీకృతాజాండ ! ని
చ్చలు నీ పాదమె నమ్మియున్న మము కృష్ణా ! వేణుగోపాలకా ! 95

వన్నెల్! వన్నెల్ ! పిన్నకూకటులపై బర్హావతంసాదృతీ !
కన్నుల్ ! కన్నులు ! నెమ్మిగుంపుల మెయిన్ గాంతార ఖేలారతీ !
వెన్నల్ ! వెన్నలు ! మోవి కెంజిగురుపై వ్రీడావిహీనాకృతీ
చిన్నెల్ ! చిన్నెలు ! చిన్ని చెక్కిళులపై శ్రీ వేణుగోపాలకా ! 96

బహుజన్మాఘ మహాగముల్ నొగులగా పాటించి నా నెమ్మదిన్
బహుజన్మార్జిత పుణ్యసంచయ ఫలంబౌ నీ పదాంభోజముల్
విహరింపన్ దయజూతు విట్టి కరుణావేశంబు శ్రీరుక్మిణీ
గృహమేధీ ! తలపోయ నా కలవియే ? శ్రీ వేణుగోపాలకా ! 97

ఘలు ఘల్ ఘల్లున కింకిణీ కిణికిణుల్ కాళీయ భాస్వత్ ఫణా
తల రత్న స్థలులందు గ్రేళ్ళురికి నృత్తంబాడు నెత్తమ్ము లా
లలితాంఘ్రిద్వయిక్రింద నేర్పరుతు నుల్లం బల్లనన్ మెత్తనౌ
జిలుగుల్ జిల్గులుగాగ నొత్తమికినై శ్రీ వేణుగోపాలకా ! 98

తలపన్ నేరను నేర శబ్దములు నర్థవ్రాతమున్ గావ్య శో
భ లలంకారములున్ గుణంబులు ధ్వనివ్యంగ్యంబులున్ మున్నుగా
నలసుండన్ బలికించితయ్య ! శతపద్య శ్రేణి నా నోట, న
ర్మిలి వెన్నాడుచు నన్ను రేబవ లహో ! శ్రీ వేణుగోపాలకా ! 99

స్నానంబున్ జపమున్ దపంబును ననుష్ఠానంబు సర్వంబు నీ
వై నాగుండియ నిండియుండి రచనావ్యాసంగ మిట్టైన, స
ర్వా నేహంబును నన్ను బాయకే కృపన్ రక్షింపవే భక్తులన్ !
శ్రీనిత్యస్థితి నిల్పి వేములమడన్ శ్రీ వేణుగోపాలకా ! 100

(1981)

ఓం తత్సత్

BCi

BC

YRKA111B.174

మల్లంపల్లి శరభయ్య

(1928-2007)

శ్రీ శరభయ్య సరస్వతి అవతారము. పూర్వ గీర్వాణాంధ్ర కవులందరూ ఆయన రసనాగ్రమెక్కి తమ ఘనతను చాటుకుంటారు; తమ కీర్తిపతాకను ఎగుర వేస్తారు. ఆయన వాక్కు మేరువులా ఆ దేవతల నివాస స్థానము...

...ఆయన, పద్యం చేత నైకభంగిమల్లో నాట్యం చేయిస్తాడు. ఆయన సీసపద్యాలు రాజమార్గంలో అడుగుపెట్టిన ఐరావతాల మందలు; ఆయన శార్దూల మత్తేభాలు ప్రమథ గణాల చిందులు. ఆయన పద్యంలో ఒక్కో పాదం ఒక్కో చెరుకుగెడ; ఆ గెడలో కణుపులే గణాలు! 'పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే నమస్తే జగదేక మాతః'

గుంటూరు శేషేంద్రశర్మ

ఎమెస్కో

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	YRKA111B174
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	13 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	89
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	Cj Bri
లేని పేజీలు	NO
తయారు చేసినది	vedavathi
పేజీలు సరిచేసినది	నాగేశ్వరి
స్కాన్ చేసినది	Ch. Nageswari
పరీక్ష చేసినది	BUJJI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good